

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 394 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 17 ఏప్రిల్ 2025 | వెల : 4/-

## గ్రీన్ ఎనర్జీ పాలసీతో రాష్ట్రానికి

# భారీగా పెట్టుబడులు



- ఉప ముఖ్యమంత్రి భట్టి సమక్షంలో 29 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్న జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు
- 2034-35 నాటికి 31 809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ అంచనాకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు
- 2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు వెళుతున్న ప్రభుత్వం
- కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల అభివృద్ధితో రైతులకు ఆర్థికంగా మేలు జరగాలి
- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
- టీజీ రెడ్కోతో జరిగిన ఎంఓయు కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్

ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీకి ఆకర్షితులై జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్, రాజేందర్ నగర్ లోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ రూరల్ డెవలప్మెంట్ సంస్థలో గౌరవ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమక్షంలో 29 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి %ు+ =జుణజూ% తో ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జిపిఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఎంవోయూ చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురావడం వల్ల రాష్ట్ర ముఖ్యమంత్రి- మిగతా3లో



## వక్ఫ్ చట్టంపై మధ్యంతర ఉత్తర్వులు

- కేంద్రం ప్రభుత్వంతో పాటు ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ



## గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు చిన్నారులు దుర్మరణం

- బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఘటన
- ఇంట్లో వంట చేస్తూ తల్లి బయటికి వెళ్లిన సమయంలో మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలుడు సంభవించినట్లు ప్రాథమిక విచారణ

## మే 1 నుంచి 15 బ్యాంకుల విలీనం




- దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మే ఒకటి నుంచి ఒక రాష్ట్రం ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అనే విధానం అమలు
- తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదన ప్రకారం 11 రాష్ట్రాలలో 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం కోసం ఒక నోటిఫికేషను విడుదల
- ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణలో ఈ విలీనం నాలుగవ దశ అని తెలుస్తుంది

## కంచ గచ్చిబౌలి భూములపై సర్కారు వితండవాదం తగదు



ఢిల్లీ

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వితండవాదాన్ని మానుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూములపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ తరుణంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం 100 ఎకరాల్లో చెట్లను పునరుద్ధరించాలి. చీఫ్ సెక్రటరీకి తెలియకుండా సీఎం రేవంత్ రెడ్డి చెట్ల నరికివేతకు ఆదేశాలు ఇచ్చారు. కొంపలు మునిగిపోతున్నట్లుగా ఫ్లడ్‌లైట్లు పెట్టి మరి చెట్లు నరికారు. పర్యావరణ విషయంలో నాపై పోలీసులు కేసులు పెడతానంటే..రెడీ. హైదరాబాదులో ఒక్క చెట్టు కొట్టాలన్న వాల్టా చట్టం కింద అనుమతి తప్పనిసరి. ప్రభుత్వాలు నడిపేందుకు భూములు అమ్మితే భవిష్యత్తు తరాలు క్షమించవు' అని వ్యాఖ్యానించారు.



## సీఎన్‌జీ ఆటోలపై నిషేధం!

- సీఎన్‌జీ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలతో భర్తీ చేయనున్నారనే వార్తలు
- సీఎన్‌జీతో నడిచే ఆటోరిక్షాలపై నిషేధం విధిస్తామన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు
- ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా ఢిల్లీ సర్కార్ పనిచేస్తోంది
- త్వరలోనే 'ఈవీ పాలసీ 2.0'ను తీసుకురావడానికి సన్నద్ధం

# జైలుకు పంపుతాం?

- కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో రేవంత్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ
- తెలంగాణ సర్కార్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక
- చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దు
- వంద ఎకరాలను ఎలా పునరుద్ధరణ చేస్తారో చెప్పండి
- తదుపరి విచారణ మే 15కు వాయిదా
- పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీలేదు
- వీడియోలు చూసి మేము ఆందోళనకు లోనయ్యాం
- అభివృద్ధి, పర్యావరణానికి మధ్య సమతుల్యం అవసరం
- ఇష్టం వచ్చినట్టు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తామంటే ఊరుకోం



న్యూ ఢిల్లీ

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా అక్కడ చెట్ల నరికివేతపై జస్టిస్ గవాయి, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే, వంద ఎకరాలను ఎలా పునరుద్ధరణ చేస్తారో చెప్పండి అని ప్రశ్నించింది. తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది. కంచె గచ్చిబౌలి భూముల అంశంపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ గవాయి, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ధర్మాసనం.. చెట్ల నరికివేతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. దీన్ని సమర్థించుకోవద్దంటూ చురకలు అంటించింది. వాటిని ఎలా పునరుద్ధరణ చేస్తారో చెప్పండి.. లేదంటే అధికారులు - మిగతా3లో



## రెండు రకాల గుర్రాలు.. గుజరాత్‌లో కాంగ్రెస్ వ్యూహంపై రాహుల్

- కాంగ్రెస్ పార్టీ నైతికస్థైర్యం కోల్పోయినట్టు కనిపిస్తున్నప్పటికీ రాష్ట్రంలో వాళ్లను (బీజేపీ) ఓడిస్తాం
- పార్టీలోని అంతర్గత సవాళ్లను పరిష్కరించేందుకు రాష్ట్రంలో కొత్త నాయకత్వాన్ని పరిచయం చేస్తాం
- ఇప్పుడు జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం పోరాటం కాదని, సైద్ధాంతిక పోరాటం
- ఆర్ఎస్ఎస్, బీజేపీని ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదనే విషయం ప్రజలకు తెలుసు

## భూ సమస్యలు లేని తెలంగాణే లక్ష్యంగా

# భూభారతి

- నేటి నుంచి పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- ప్రత్యేక ఫార్మాట్‌లో దరఖాస్తు
- మద్దూర్ మండలంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్

భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్నితీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందన్నారు. భూభారతి అవగాహన సదస్సులపై గురువారం నాడు ఈ సందర్భంగా మంత్రి సమీక్షించారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో గురువారం నుంచి ( 17వ తేదీ) రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామని అలాగే - మిగతా3లో

# ట్రంప్ ఎఫెక్ట్... మేకిన్ ఇండియాకు లైఫ్

**ముంబై :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌విధిస్తున్న కొత్త సుంకాలతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా కుప్ప కూలే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల అమలును మూడు నెలలు వాయిదా వేశారు. అయితే చైనాపై మాత్రం సుంకాలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇదే ఇప్పుడు భారత తయారీ రంగానికి బూస్ట్‌గా మారింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త సుంకాలు (టారిఫ్‌లు) చైనా ఉత్పత్తులపై భారీగా ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత తయారీ రంగానికి అనూహ్యమైన అవకాశాలు ఏర్పడుతున్నాయి. చైనాపై అధిక సుంకాలతో పోలిస్తే, భారత్‌పై సాపేక్షంగా తక్కువ సుంకాలు విధించడం ద్వారా భారత్‌కు ట్రంప్ ఒక రకంగా గొప్ప రాజకీయ, ఆర్థిక అవకాశాన్ని అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని భారత్‌సద్వినియోగం చేసుకుంటే, తయారీ రంగంలో చైనాకు గట్టి పోటీ ఇచ్చే స్థాయికి చేరే అవకాశం ఉంది.ఇటీవల ఒకే రోజు మూడు కార్గో విమానాలు భారత్‌లో తయారైన ఐఫోన్‌లతో అమెరికాకు బయలుదేరిన వార్త దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించింది. ట్రంప్ కొత్త సుంకాలు అమల్లోకి రాకముందే ఈ ఉత్పత్తులను అమెరికాకు చేర్చేందుకు ఆపిల్ సంస్థ వేగంగా వ్యవహరించింది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఐఫోన్‌ల తయారీని ఆపిల్ విస్తరిస్తోంది. ప్రస్తుతం, ఆపిల్ ఉత్పత్తిలో 10?15% భారత్‌లో జరుగుతోంది, మరియు దీనిని 2025 నాటికి 25%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.చైనాపై 104% సుంకాలు విధించిన ట్రంప్, భారత్‌పై కేవలం 26% సుంకాలు నిర్ణయించారు. దీనివల్ల చైనాలో తయారైన ఐఫోన్‌లతో పోలిస్తే, భారత్‌లో ఉత్పత్తి చేసిన ఐఫోన్‌లు అమెరికా మార్కెట్‌లో ధర పరంగా గణనీయంగా పోటీదారుగా నిలుస్తాయి. ఒక ఐఫోన్ తయారీ ఖర్చు 450 డాలర్లు అనుకుంటే, చైనాలో ఉత్పత్తి చేస్తే సుంకాలతో కలిపి అమెరికాలో దాని ధర 918 డాలర్లకు చేరుతుంది, అయితే భారత్‌లో తయారైనది కేవలం 567 డాలర్లకే అందుబాటులో ఉంటుంది. ఈ ధరల వ్యత్యాసం ఆపిల్‌ను భారత్‌లో ఉత్పత్తిని విస్తరించేలా ప్రోత్సహిస్తోంది.చైనా?అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు అధిక సుంకాలు విధిస్తూ, వాణిజ్య ఆంక్షలను కఠినతరం చేస్తున్నాయి. ఈ పరిస్థితి చైనా ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో డిమాండ్‌ను గణనీయంగా తగ్గిస్తోంది. ఈ ఖాళీని భర్తీ చేయడానికి భారత్ అనువైన గమ్యస్థానంగా మారుతోంది.కరోనా మహమ్మారి తర్వాత, చైనాపై



ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు 'చైనా+1' వ్యూహాన్ని అనుసరించాయి. ఈ వ్యూహంలో భాగంగా, భారత్‌లో తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపాయి. అయితే, ఊహించిన స్థాయిలో ఈ అవకాశాలను భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయిందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పుడు, ట్రంప్ సుంకాల విధానం ద్వారా భారత్‌కు కొత్త అవకాశాలు తలుపులు తెరుస్తోంది. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ భాగాలు, మరియు ఇతర తయారీ రంగాల్లో భారత్ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ట్రంప్ సుంకాలు భారత్‌కు అవకాశాలను తెచ్చిపెట్టినప్పటికీ, కొన్ని సవాళ్లు కూడా ఎదురవుతాయి. భారత్‌పై విధించిన 26% సుంకాలు, చైనాతో పోలిస్తే తక్కువైనప్పటికీ, ఇతర ఆసియా దేశాలైన జపాన్(24%) మరియు దక్షిణ కొరియా (25%)తో పోలిస్తే ఇది ఎక్కువే. ఈ సుంకాలు భారత ఎగుమతులపై కొంత ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఆభరణాలు, మరియు ఇంజనీరింగ్ వస్తువుల వంటి రంగాల్లో. అయినప్పటికీ, భారత్‌కు ప్రస్తుతం ఉన్న సాపేక్ష ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కొన్ని కీలక చర్యలు అవసరం.

మౌలిక సదుపాయాల అభివృద్ధి: తయారీ కేంద్రాల స్థాపనకు అనువైన లాజిస్టిక్స్, విద్యుత్ సరఫరా, మరియు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలి.

వ్యాపార సౌలభ్యం: విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బిజినెస్ ఈజ్ ఆఫ్ డూయింగ్‌ను మెరుగుపరచడం ద్వారా, అడ్మినిస్ట్రేటివ్ ఆటంకాలను తగ్గించాలి.

ప్రోత్సాహకాల విస్తరణ: ప్రస్తుతం ఉన్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాలను మరింత విస్తరించి, ఎక్కువ రంగాలను చేర్చాలి.

**నైపుణ్య శిక్షణ:** తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణా కార్యక్రమాలను బలోపేతం చేయాలి.

భారత ప్రభుత్వం చొరవ: ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భారత ప్రభుత్వం చొరవ కీలక పాత్ర పోషిస్తుంది. గతంలో చైనా+1 వ్యూహంలో భాగంగా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోయిన నేపథ్యంలో, ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయడం, విదేశీ సంస్థలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను అందించడం, మరియు దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలు అత్యవసరం. అదే సమయంలో, చైనా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకునే సంస్థలు, దీర్ఘకాలికంగా ఇక్కడే పెట్టుబడులు పెట్టేలా చూడాలి. ఇందుకోసం, భారత్ తన ఆర్థిక విధానాలలో స్థిరత్వాన్ని కొనసాగించాలి. తద్వారా భారత్ తయారీ రంగంలో కొత్త శకాన్ని ప్రారంభించవచ్చు.

# వక్ఫ్ చట్టంపై మధ్యంతర ఉత్తర్వులు ఇస్తాం

కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ ప్రారంభించింది. అయితే, వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు నిరాకరించిన ధర్మాసనం.. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వక్ఫ్ ఆస్తులపై వివాదంపై కలెక్టర్లకు అధికారాలు, కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను డీ నోటిఫై చేయడం తదితర కీలక నిబంధనలపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. ఈ సందర్భంగా కేంద్రం ప్రభుత్వంతో పాటు ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ చేస్తూ విచారణను గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణ వాయిదా వేసింది. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ కన్నా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశించింది. ఈ వివాదంపై దాఖలైన పలు పిటిషన్లపై రేపు మధ్యంతర తీర్పును ఇవ్వనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతూ.. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వక్ఫ్ బోర్డులో తరహాలో ముస్లింలను హిందూ ట్రస్ట్‌లో భాగం చేయడానికి అనుమతించడానికి సిద్ధంగా ఉన్నారా? అని కేంద్రాన్ని నిలదీసింది. వందల ఏళ్ల నాటి వక్ఫ్ ఆస్తులకు ఇప్పుడు పత్రాలు ఎక్కడి నుంచి



వస్తాయని ప్రశ్నించింది. సుదీర్ఘకాలంగా ముస్లిం కార్యక్రమాలకు వాడుతున్న (వక్ఫ్ బై యూజర్) ఆస్తులను డినోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయని పేర్కొంది. వక్ఫ్ బై యూజర్ ఆస్తులను రిజిస్టర్ చేయడం కష్టమని.. ఇది పలుమార్లు దుర్వినియోగమైందని ధర్మాసనం పేర్కొంది. నిజంగా ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ఆస్తులు ఉన్నాయని.. హిందువుల ఆస్తులను హిందువులే నిర్వహిస్తున్నారు కదా? అని ప్రశ్నించింది. పార్లమెంటుకు చట్టాలు చేసే అధికారం లేదా? హిందువుల కోసం కూడా పార్లమెంట్ చట్టాలు చేస్తుంది కదా? ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలోనే ఉందని అంటున్నారని.. చారిత్రక, పురావస్తు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించడానికి వీలు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. వక్ఫ్ చట్టంలోని అభ్యంతరాలను ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చిన ఆయన.. వక్ఫ్ కొత్త చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. కొత్త చట్టం ప్రకారం.. కలెక్టర్‌కు ఇచ్చే అధికారాలను సిబల్ ప్రస్తావించారు. కలెక్టర్ ప్రభుత్వంలో ఒక భాగమని, ఆయన న్యాయమూర్తి పాత్ర పోషిస్తే అది రాజ్యాంగ విరుద్ధమేనన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చే నిబంధనను కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. ముస్లింల హక్కులను కాలరాసేలా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టారన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతోన్న ఆందోళనల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం బాధకరమని, హింసాత్మక ఘటనలు తమను తీవ్రంగా బాధించాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు చేస్తూ.. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. చట్టంపై స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జేపీసీ ద్వారా సంపూర్ణంగా అన్నివర్గాలతో చర్చలు జరిపామని చెప్పారు. వక్ఫ్ అనేది కేవలం చారిటీకి సంబంధించిదేనని.. హిందూ ధార్మిక సంస్థలను సైతం ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.

## రెండు రకాల గుర్రాలు..
# గుజరాత్‌లో కాంగ్రెస్ వ్యూహంపై రాహుల్

**మోడాసా:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బీజేపీని ఓడించగలిగే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నైతికస్థైర్యం కోల్పోయినట్టు కనిపిస్తున్నప్పటికీ రాష్ట్రంలో వాళ్లను (బీజేపీ) ఓడిస్తామని పార్టీ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. పార్టీలోని అంతర్గత సవాళ్లను పరిష్కరించేందుకు రాష్ట్రంలో కొత్త నాయకత్వాన్ని పరిచయం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో రెండ్రోజుల పర్యటనకు బుధవారంనాడిక్కడ వచ్చిన రాహుల్ గాంధీ మోడాసాలో జరిగిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సదస్సులో పాల్గొన్నారు. పార్టీ వ్యూహాలను వివరిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గుజరాత్‌లో పార్టీని పునర్వవస్థీకరించేందుకు తీసుకుంటున్న చర్యలను రాహుల్ ప్రస్తావిస్తూ, దీనిపై చాలా నెలలుగా పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం పోరాటం కాదని, సైద్ధాంతిక పోరాటమని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీని ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదనే విషయం ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. దీనిపై జిల్లాలకు చెందిన సీనియర్ నేతలను తాను కలుసుకున్నానని, చక్కటి చర్చలు జరిగాయని తెలిపారు. నాయకుల మధ్య పోటీ వినాశకరమని, నిర్మాణత్మకం కాదని నేతలు తనకు చెప్పారని అన్నారు.

**రెండు రకాల గుర్రాలు**

పార్టీలో నాయకత్వ సవాళ్లను గురించి మాట్లాడుతూ, గుర్రాల లో రెండు రకాలు ఉంటాయని, ఒకటి రేసులకు ఉద్దేశించి నవని, రెండో రకం పెళ్లిళ్లకు ఉద్దేశించినవని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కొన్నిసార్లు వెడ్డింగ్ హార్స్‌లను రేసులకు, రేసింగ్ హార్స్‌లను పెళ్లిళ్లకు పంపుతున్నట్టు నాయకులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. సరైన నేతలకు సరైన బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు. "ఈ రెండు రకాల గుర్రాలను సెపరేట్ చేయాలి. జిల్లాలను స్థానికంగానే నడపడం వల్ల అభ్యర్థులకు, ఆర్గనైజేషన్‌కు మధ్య పటిష్ట బంధం ఉంటుందనే నిశ్చితాభిప్రాయానికి పార్టీ వచ్చింది" అని ఆయన వివరించారు. నాయకులు తన దృష్టికి తెచ్చిన విషయాలను రాహుల్ మరింత వివరిస్తూ, అహ్మదాబాద్ నుంచి సీనియర్ నాయకులు వచ్చి రెండు రోజులు హంగామా చేసి వెళ్లిపోతుంటారని, వాళ్లు వెళ్లిపోగానే జనం కూడా మాయమై పోతుంటారని, దీని వల్ల బూత్‌లు కూడా గెలుచుకోలేకున్నామని కొందరు చెప్పినట్టు తెలిపారు. మరో అంతర్గత అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. చాలా మంది పార్టీ నేతలకు బీజేపీతో సంబంధాలు ఉన్నాయని తెలుస్తోందని, అలాంటి వారిని గుర్తించి పార్టీకి దూరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## మే 1 నుంచి 15 బ్యాంకుల విలీనం




**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జమ్మూ మరియు కాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో దీని ప్రభావం కనిపించనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మే ఒకటి నుంచి ఒక రాష్ట్రం ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అనే విధానం అమలులోకి రానుంది. తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదన ప్రకారం 11 రాష్ట్రాలలో 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం కోసం ఒక నోటిఫికేషన్ను విడుదల చేసింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణలో ఈ విలీనం నాలుగవ దశ అని తెలుస్తుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా రీజినల్ రూరల్ బ్యాంక్ ల సంఖ్య 43 నుండి 28కి తగ్గనుందని తెలుస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో పాటు అనేక ప్రభుత్వ బ్యాంకులతో ఈ బ్యాంకులు అనుబంధంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇవి గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేస్తాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దీని ప్రభావం మొత్తం దేశంలోని 11 రాష్ట్రాలలో కనిపించబోతుంది. ప్రస్తుతం ఈ రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో ఒకే సంస్థగా త్వరలో విలీనం కానున్నాయి.ఈ విధంగా తాజాగా ప్రభుత్వం ఒక రాష్ట్రం ఒక రీజినల్ రూరల్ బ్యాంకు లక్ష్యాన్ని సాధించవచ్చు.వీటి విలీనం కోసం మే 1, 2025 గా నిర్ణయించడం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు స్పాన్సర్ చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అలాగే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విలీనం అయ్యి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మే 1 నుంచి ఏర్పడతాయి. అలాగే ఉత్తరప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాలలోని మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఒకే సంస్థగా విలీనం కాబోతున్నాయి.ఉత్తరప్రదేశ్లో ఉన్న బరోడా యూపీ బ్యాంకు, ఆర్య వర్క్ బ్యాంకు, ప్రథమ యుపి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఉత్తరప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా ఏర్పడనున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో దీని ప్రధాన కార్యాలయం లక్నోలో ఉంటుందని సమాచారం. అదేవిధంగా బంగీయ గ్రామీణ వికాస్ బ్యాంక్ మరియు పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంక్, ఉత్తర్బాంగ్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంకును పశ్చిమ బెంగాల్లో ఏర్పాటు చేయనున్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు చిన్నారులు దుర్మరణం



ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు పదేళ్లలోపు చిన్నారులు దుర్మరణం పాలైన ఘటన బీహార్ లోని ముజఫర్‌పూర్ జిల్లా లో బుధవారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో వంట చేస్తూ తల్లి బయటికి వెళ్లిన సమయంలో మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలుడు సంభవించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వివరాల్లోకి వెళ్తే.. ముజఫర్‌పూర్ జిల్లాలోని బరియార్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల రాంపూర్‌మని గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో వంట చేస్తూ మిగతా వంటపాత్రలు కడిగేందుకు బయటికి వెళ్లింది. అదే సమయంలో స్టవ్ మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలిపోయింది. దాంతో ఇంట్లో ఉన్న నలుగురు చిన్నారులు బ్యూటీ కుమారి (8), విపుల్ కుమార్ (5), సృష్టి కుమారి (4), హన్సిక కుమారి (3) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. కాగా ఈ పేలుడు ఘటనలో మరణించిన చిన్నారుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున మొత్తం 16 లక్షలు అందజేయనున్నట్లు ముజఫర్‌పూర్ జిల్లా కలెక్టర్ తెలిపారు.

## సీఎన్‌జీ ఆటోలపై నిషేధం!



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో సీఎన్‌జీ ఆటోలపై నిషేధం అంటూ జరుగుతున్న ప్రచారంపై ఢిల్లీ రవాణా శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ స్పష్టత నిచ్చారు. సీఎన్‌జీ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలతో భర్తీ చేయనున్నారనే వార్తలను మంత్రి పంకజ్ కుమార్ సింగ్ కొట్టిపారేశారు. సీఎన్‌జీతో నడిచే ఆటోరిక్షాలపై నిషేధం విధిస్తామన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా ఢిల్లీ సర్కార్ పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఢిల్లీలో ఎలాంటి ఆటోలను తాము నిలిపివేయబోమని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని.. దీనిని దృష్టిలో ఉంచుకుని అక్కడి ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకోబోతుందంటూ వార్తలు వచ్చాయి. త్వరలోనే 'ఈవీ పాలసీ 2.0'ను తీసుకురావడానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సీఎన్‌జీ ఆటోలపై బ్యాన్ విధిస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. దీంతో రవాణా శాఖ మంత్రి స్పందిస్తూ సీఎన్‌జీ ఆటోలపై నిషేధం విధించబోమంటూ క్లారిటీ ఇచ్చేశారు.

# గ్రీన్ ఎనర్జీ పాలసీతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి



ఎనుముల రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు దావోస్ వెళ్ళినప్పుడు సన్ పెట్రో కంపెనీ 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి 20వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయు చేసుకున్నదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధంగా మెగా కంపెనీ 1500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి 7500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చిందన్నారు. ఈ రెండు కంపెనీలు డిపిఆర్ తయారు చేసే పనిలో ఉన్నాయని తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే ఈ రెండు కంపెనీలకు చెందిన కొత్త ప్రాజెక్టులు రాష్ట్రంలో మొదలవుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ వల్ల రాష్ట్రంలో 27 వేల కోట్ల పెట్టుబడులతో 5600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడానికి ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకొచ్చి ఈరోజు రాష్ట్ర ప్రభుత్వంతో ఎం ఓ యు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో వస్తున్న పెట్టుబడులతో రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలు అధిగమించడానికి త్వరితగతిన ముందుకెళ్లే అవకాశం ఉందన్నారు. 2023 సంవత్సరంలో 15,623 మెగావాట్ల గరిష్ట పిక్ డిమాండ్ రాగా, ఈ సంవత్సరం మార్చి 20న 17,162 మెగావాట్ల గరిష్ఠ పీక్ డిమాండ్ చేరుకున్నప్పటికీ పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఇంట్రప్షన్ లేకుండా నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు సరఫరా చేశామని చెప్పారు. హైదరాబాద్ మహానగరం రోజు రోజుకి అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్, మూసి పునర్జీవం, ఫ్యూచర్ సిటీ ఇలా అనేక రకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు పెరుగుతాయని కొన్ని సంస్థలు అధ్యయనం చేసి కేంద్రానికి పంపిన నివేదికల ఆధారంగా 2029-30 నాటికి 24,215 మెగావాట్ల గరిష్ట డిమాండ్, 2034- 35 నాటికి 31 809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ పెరుగుతుందని అంచనా వేసుకొని దీనికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి ప్రణాళికలు తయారు చేసుకొని ప్రభుత్వం ముందుకెళ్తున్నదని వివరించారు 2030 నాటికి 20వేల మెగావాట్లు, 2035 నాటికి మరో 20వేల మెగావాట్లు మొత్తం 40 వేల మెగావాట్లు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసుకొని యాక్షన్ ప్లాన్ తో ముందుకుపోతున్నదని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యూ ఎనర్జీ పాలసీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఉండటంతో చాలామంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడానికి ముందుకు వస్తున్నారని వెల్లడించారు.టీజీ రెడ్కో తో ఎంఓయూ చేసుకున్న ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని, క్యాలెండర్ ఫిక్స్ చేసుకొని నిర్దిష్ట గడువులోగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకురావాలని, ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. 15 జిల్లాల్లో కంప్రెస్డ్ బయో-గ్యాస్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ు+ =జుణజూ తో 2 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయూ చేసుకున్నజిపిఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు రావడం పట్ల అభినందించారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగు అవుతున్న నేపథ్యంలో వరి గడ్డితో తయారు చేసే కంప్రెస్డ్ బయోగ్యాస్ వల్ల రైతులకు ఆర్థికంగా ఉపయోగం జరుగాలన్నారు.

# కాక రేపుతున్న మంత్రి పదవులు



**హైదరాబాద్ :** కేబినెట్ విస్తరణ తెలంగాణ కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. మంత్రి పదవులపై లుకలుకలు మొదలయ్యాయి. మాకంటే మాకంటూ కేబినెట్ బెర్త్ కోసం కర్చీఫ్ వేస్తున్నారు ప్రముఖులంతా. ఉగాదికే జాబితా వస్తుందనుకుంటే.. అది కాస్తా ఆలస్యం అవుతుండటంతో రచ్చ రాజుకుంటోంది. ఆ ఉక్కబోత భరించలేక ఆశావహులు ఒక్కొక్కరిగా నోరు జారుతున్నారు. బహిరంగంగానే బయటపడుతున్నారు. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మాజీ మంత్రి జానారెడ్డిని టార్గెట్ చేయగా.. లేటెస్ట్‌గా ప్రేమ్ సాగర్ రావు.. ఓ కుటుంబాన్ని కార్నర్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌లో కలకలం రేపారు.మంత్రి పదవిని అడ్డుకుంటూ.. తన గొంతు కోసేందుకు ఓ కుటుంబం ప్రయత్నిస్తోందంటూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గొంతు కోస్తే ఊరుకోబోనని.. కుటిల యత్నాలను తిప్పికొడతానని హెచ్చరించారు. పార్టీని కష్టకాలంలో కాపాడిన వారికి అవకాశాలు కల్పించాలని.. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేయవద్దన్నారు. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ప్రేమ్ సాగర్ రావు టార్గెట్ చేసింది ఎవరిననే చర్చ జరుగుతోంది తెలంగాణలో.రాజగోపాల్‌రెడ్డి గురించే ప్రేమ్‌సాగర్ అలా అన్నారని కొందరు అంటున్నా.. అది కరెక్ట్ కాదని తెలుస్తోంది. ఆయన మాట్లాడింది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల గురించేనని చెబుతున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామినే తన మంత్రి పదవికి చెక్ పెడుతున్నారనేది ప్రేమ్ సాగర్ వ్యాఖ్యల అంతరార్థం అంటున్నారు. వివేక్‌తో పాటు కుటుంబంలో ఆయన సోదరుడు వినోద్ కూడా ఎమ్మెల్యేగా ఉన్నారు. కొడుకు వంశీ.. ఎంపీగా కొనసాగుతున్నారు. వివేక్ గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత బీజేపీకి మారారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు. అందుకే ఆయన్ను టార్గెట్ చేస్తూ.. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కామెంట్స్ చేశారు. ఉమ్మడి జిల్లా కోటాలో కేబినెట్ రేసులో ప్రేమ్ సాగర్‌కు వివేక్ నుంచి పోటీ ఉంది. ఆ ఫ్యామిలీ గుత్తాధిపత్యం కోసమే.. తన కేబినెట్ బెర్త్ కన్ఫమ్ కాకుండా అడ్డుకుంటున్నారనేది ప్రేమ్ సాగర్ రావు అక్కసుగా తెలుస్తోంది.పెద్దలు జానారెడ్డిని రాజగోపాల్‌రెడ్డి టార్గెట్ చేసిన మరుసటి రోజే ప్రేమ్ సాగర్ రావు సైతం బహిరంగ ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీలో కాస్త కుదుపు వచ్చినట్టైంది. కేబినెట్ విస్తరణ లేట్ అవుతున్నా కొద్దీ.. ఇలాంటి పరిస్థితులే తలెత్తుతాయని.. అందుకే వీలైనంత తొందరగా ఆ పని పూర్తి చేయాలని అధిష్టానానికి మెసేజ్‌లు వెళ్తున్నాయట. నల్గొండలో రాజగోపాల్‌రెడ్డి బలమైన నాయకుడు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్ సాగర్ రావు తిరుగులేని నేత. వారికి మంత్రి పదవులు ఇవ్వడంపై పార్టీ పెద్దలెవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. జానారెడ్డి ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన కుమారుడు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ఈయన్ను అడ్డుకోవడం అనేది టీ కప్పులో తుఫాను లాంటి వివాదమే తప్ప అంత పెద్దగా చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఆదిలాబాద్‌లో మాత్రం ప్రాబ్లమ్ కాస్త సీరియస్ గానే ఉన్నట్టుంది. ప్రేమ్ సాగర్ రావు ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆయన్ను సంతృప్తి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇంకా ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, చెన్నూర్‌ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు మంత్రి పదవుల రేసులో ఉన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దాదాపు 14 సంవత్సరాలుగా పార్టీని అంటి పెట్టుకుని ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అందరూ కాంగ్రెస్ పార్టీని వీడిపోయినా ఆయన మాత్రం పార్టీ కోసం ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ సజీవంగా ఉందంటే అది ప్రేంసాగర్‌రావు కృషి వల్లనే అని కాంగ్రెస్ క్యాడర్ భావిస్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 66వేలకుపైగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ప్రధానంగా గడ్డం వివేక్ నుంచి పోటీ వస్తోంది. ఆయన ఎస్సీ నేత కావడంతో ప్లస్ గా మారింది. అయితే పలుమార్లు పార్టీ మారి వచ్చారు. ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలచిన వెడ్మ బొజ్జు కూడా గిరిజన కోటాలో తనకు పదవి వరిస్తుందనే ఆశతో ఉన్నారు.సామాజిక సమీకరణాలతో తన సీనియార్టీని.. పార్టీకి చేసిన సేవలను గుర్తించకపోతే ఊరుకునేది లేదని ప్రేమ్ సాగర్ రావు బహిరంగంగానే చెబుతున్నారు. మరో వైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని అంటున్నారు. తనకు పదవి రాకుండా.. చేసేందుకు జానారెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు అయిపోయిందని అనుకులోనేలోపే కొత్త కొత్త అడ్డంకులు వచ్చేశాయి. ఉగాది రోజున సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ ను కలవడంతో మూడో తేదీన మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అందరూ మానసికంగా రెడీ అయిపోయారు. ఎవరెవరికి బెర్తులన్నదానిపై కాంగ్రెస్ లో చర్చోపచర్చలు జరిగాయి. కానీ ఆ మూడో తేదీ దాటి పది రోజులు అయినా హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదు. ఈ లోపు పార్టీ నేతుల ఎవరికి వారు తమకు పదవులు ఇవ్వాల్సిందేనన్న డిమాండ్లపై తెరపైకి వస్తున్నారు. ఒకరికి పదవి ఇచ్చి మరొకరికి ఇవ్వకపోతే అసంతృప్తి పెరిగి పుట్టి మునిగిపోతుందని అసలు మంత్రి వర్గ విస్తరణనే కాంగ్రెస్ హైకమాండ్ ఆలస్యం చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది.

# మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు




**హైదరాబాద్ :** తెలంగాణలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతీ నది పుష్కరాలకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పుష్కరాల కోసం దేవాదాయ శాఖ రూ.25 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. పుష్కరాలకు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున వారి కోసం స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. 2025 మే 15న సూర్యోదయంతో పుష్కర పుణ్యస్నానాలు ప్రారంభమవుతాయి.. మే 26 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఏడాదికి ఓ నదికి పుష్కరాలు వస్తాయ్. 2025లో సరస్వతీ నదికి పుష్కరాలొస్తున్నాయ్.పూర్వం పుష్కరుడు అనే బ్రాహ్మణుడు శివుడి కోసం తపస్సు ఆచరించాడు. భక్తికి మెచ్చి ప్రత్యక్షమైన శివుడు ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. ఓ దేవా జీవులు చేసిన పాపాలతో నదులన్నీ అపవిత్రమవుతున్నాయి. నదులు పునీతమైతే ప్రజలు సుభిక్షంగా ఉంటారు ఆ శరీర స్పర్శతో నదులు పునీతం అయ్యేలా వరం ఇమ్మని అడిగాడు. నువ్వు ఏ నదిలోకి ప్రవేశిస్తే ఆ నది పునీతం అవుతుందనే వరం ఇచ్చాడు శివుడు. అలా పుష్కరుడు ఏడాదికి ఓనదిలో ప్రవేశిస్తాడు. అది కూడా బృహస్పతి రాశి మారిన సమయంలో. ఏడాదికి ఓ రాశిలోకి పరివర్తనం చెందుతాడు బృహస్పతి. మొదటి 12 రోజులను ఆది పుష్కరాలుగా, చివరి 12 రోజులను అంత్య పుష్కరాలుగా నిర్వహిస్తారు. బృహస్పతి ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు క్రమ పద్ధతిలో పుష్కరాలు జరిగేలా రూపొందించారు పండితులు. గురువు మేష రాశిలో ప్రవేశించినప్పుడు గంగానదికి, వృషభ రాశిలో ప్రవేశి స్తే నర్మదానది, మిథునంలో ప్రవేశిస్తే సరస్వతి, కర్కాటకంలో ఉన్నప్పుడు యమునానది, సింహరాశిలో ప్రవేశిస్తే గోదావరి నదికి..ఇలా ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కో నదికి పుష్కరాలు జరుగుతాయి. అలా ఈ ఏడాది సరస్వతీ నది పుష్కరాలు మే 15 నుంచి 26 వరకు జరుగుతాయిముక్తీశ్వర లింగానికి వున్న నాసిక రంధ్రాల గుండా ఎంత నీరు పోసినా బయటికి రాకుండా భూమార్గంలో ప్రవహించి సరస్వతి నదిరూపంలో గోదావరి, ప్రాణహిత నదులతో కలిసి త్రివేణి సంగమంగా ఏర్పడిందని చెబుతారు. అందుకే సరస్వతీ నదికి గుప్త కామినీ అనే మరో పేరుంది. కాశీ క్షేత్రంలానే కాళేశ్వరం కూడా పిండ ప్రదానానికి ముఖ్యమైన క్షేత్రం అని చెబుతారు. కాశీ కి వెళ్ల లేని వాళ్ళు ఇక్కడ గోదావరి-ప్రాణహిత-సరస్వతి నదుల త్రివేణి సంగమ స్థానంలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో గంగా, యమున మరియు సరస్వతి నదుల సంగమం ఉంది కానీ ఇక్కడ సరస్వతి నది అంతర్వాహిని. ఇంకా గుజరాత్ దగ్గర సిద్ధపూర్, మానా దగ్గర కూడా సరస్వతి పుష్కరాలు జరుగుతాయి. సరస్వతి నది హిమాచల్ ప్రదేశ్‌లోని శివాలిక్ కొండల నుంచి ప్రారంభమై, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల గుండా ప్రవహించి కచ్ సింధుశాఖ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది.

## భూ సమస్యలు లేని తెలంగాణే లక్ష్యంగా భూభారతి

-మొదటిపేజీ తరువాయి


భూభారతి పైలట్ ప్రాజెక్ట్ అమలు చేసే నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నారాయణ్‌పేట జిల్లా మద్దూర్ మండలంలోని కాజాపురం గ్రామంలో భూభారతి పైలట్ ప్రాజెక్ట్‌ను తానే స్వయంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆతర్వాత వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామంలో జరిగే అవగాహనా సదస్సులో పాల్గొంటానని చెప్పారు. 18వ తేదీన ములుగు జిల్లా వెంకటాపురంలో ఉదయం జరిగే రెవెన్యూ సదస్సులోనూ, తర్వాత ఆదిలాబాద్ జిల్లాలోనూ జరిగే సదస్సులో పాల్గొంటానని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలోని నారాయణ్‌పేట్ జిల్లా మద్దూర్ మండలంతోపాటు , ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈచట్టాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ప్రయోగాత్మకంగా భూభారతిని అమలు చేసే ఈ నాలుగు మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటికి రశీదులను అందజేస్తారు. ఇందుకోసం ఒక ప్రత్యేక ఫార్మేట్ లో తయారుచేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సు ముందురోజే ప్రజలకు ఇవ్వడం జరుగుతుంది. ఎలాంటి భూసమస్యలు ఉన్నాయి, ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి, వాటి ఏవిధంగా పరిష్కరించాలి, రానున్న రోజులలో చేపట్టాల్సిన చర్యలు, భూభారతి పోర్టల్‌పై ప్రజాస్పందనను చూసి భవిష్యత్తులో ఏవిధంగా ముందుకు వెళ్లాలనే విషయంపై చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూముల మినహా ప్రతి దరఖాస్తును మే 1వ తేదీ నుంచి పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు కంప్యూటర్ లో నమోదు చేసి ఆయా సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఒకవైపు నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో భూభారతి చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ అవగాహన సదస్సులకు సంబంధించి కలెక్టర్లు ప్రతిరోజూ ప్రతి మండలంలో రెండు కార్యక్రమాలలో పాల్గొనేవిధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మండల కేంద్రాల్లో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ రెవెన్యూ ఇనస్పెక్టర్ , సర్వేయర్ తదితర అధికారులతో బృందాలుగా ఏర్పడి సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ అవగాహనా సదస్సులు పూర్తైన తర్వాత ఆ నాలుగు మండలాలలో నిర్వహించిన మాదిరిగానే రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మినహా అన్ని మండలాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు.

## జైలుకు పంపుతాం?

-మొదటిపేజీ తరువాయి

జైలుకు వెళ్లాల్సి వస్తుంది. చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా?.. సూటిగా జవాబు చెప్పండి. వంద ఎకరాలను ఎలా పునరుద్ధరణ చేస్తారు?. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీలేదు. వీడియోలు చూసి మేము ఆందోళనకు లోనయ్యాం. అభివృద్ధి, పర్యావరణానికి మధ్య సమతుల్యం అవసరం. ఇష్టం వచ్చినట్టు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తామంటే ఊరుకోం. వాటిని ఎలా పునరుద్ధరణ చేస్తారో చెప్పండి.. లేదంటే చెరువు దగ్గరే తాత్కాలిక జైలుపెట్టి అధికారులను అక్కడే ఉంచుతాం. షెల్టర్ కోసం జంతువులు పరుగులు తీస్తే.. వాటిని వీధి కుక్కలు తరిమాయి. 1996లో మేము ఇచ్చిన తీర్పుకు భిన్నంగా అధికారులు సొంత మినహాయింపులు ఇస్తే వారే బాధ్యులు అవుతారు. ప్రైవేట్ ఫారెస్టులో సైతం చెట్లు నరికితే సీరియస్‌గా పరిగణిస్తాం. భూముల తాకట్టు అంశాలతో మాకు సంబంధం లేదు. కేవలం నరికిన చెట్లను ఎలా పునరుద్ధరణ చేస్తారో చెప్పాలి. డజన్ల కొద్ది బుల్డోజర్లతో అడవిలో వంద ఎకరాలు తొలగించారు. మీరు అభివృద్ధి చేసుకోవాలనుకుంటే తగిన అనుమతులు తీసుకోవాలి. సిటీలో గ్రీన్ లంగ్ స్పేస్ ఉండాలి. వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అని ప్రశ్నించింది. చివరగా.. పర్యావరణ, వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని తెలిపింది. తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది. అనంతరం.. రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపిస్తూ.. అన్ని పనులు ఆపి వేశాం. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకుంటాం. ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేశారు. మినహాయింపులకు లోబడే మేము కొన్ని చెట్లు తొలగించాం అని చెప్పుకొచ్చారు. అమికస్ క్యూరీ వాదనలు వినిపిస్తూ.. సెల్ఫ్ సర్టిఫికేషన్ చేసుకుని.. అన్నింటికీ మినహాయింపులు ఇచ్చుకున్నారు. ఇది సుప్రీం తీర్పునకు విరుద్ధం. ఈ భూములు తాకట్టుపెట్టి ప్రభుత్వం అప్పులు తెచ్చుకుంది అని అన్నారు. అంతకుముందే, ఈ కేసులో ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం. కంచ గచ్చిబౌలి భూములు అటవీ భూములు కావు. 20 ఏళ్లుగా ఖాళీగా ఉండటం వల్ల పొదలు పెరిగాయి. అటవీ రెవెన్యూ రికార్డులలో వీటిని అడవులుగా పేర్కొనలేదు. ఆ భూములకు ఎలాంటి కంచె లేదు. కంచె ఏర్పాటు చేసేందుకు మేము ప్రయత్నం చేశాం. ఈ భూముల్లో ఎలాంటి జంతువులు లేవు. కంచె లేని కారణంగా హెచ్‌సీయూ భూములలోని పక్షులు ఇక్కడికి వచ్చాయని పేర్కొంది.

## ఉద్యోగులకు ఇంకా అందని జీతాలు



**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఆలస్యం అవుతోంది. ఫలితంగా చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు బ్యాంక్ ఈఎంఐలు కట్టడానికి ప్రైవేట్ ఫైనాన్సర్ల దగ్గర అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకుంటున్నారు. గత పదేళ్లుగా జీతాలు రావడం చాలా ఆలస్యం అవుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఖర్చులకు సరిపోవడం లేదని, దీనివల్ల జీతాలు చెల్లించడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఇటు ఎన్నికల హామీలను నెరవేర్చడానికి, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాల్సి రావడంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగింది.గతంలో ప్రభుత్వం తీసుకున్న భారీ రుణాల వల్ల ఇప్పుడు వాటి వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఇది రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రైతు రుణమాఫీ, ఇతర పథకాల కోసం తీసుకున్న రుణాలు చెల్లింపులకు ఆటంకం కలిగిస్తున్నాయికొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆలస్యం అవుతున్నాయి. ఇది కూడా ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు..రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించాల్సి రావడంతో.. జీతభత్యాల కోసం ఎక్కువ నిధులు అవసరమవుతున్నాయి. ఇటీవల పదవీ విరమణ వయస్సు పెంచినప్పటికీ, రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేయనుండటంతో పెన్షన్ల భారం మరింత పెరిగే అవకాశం ఉంది.ఉద్యోగులకు వేతన సవరణ (ఖఖీఅ), కరువు భత్యం (ఆం) పెంపుదల వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని అమలు చేస్తే జీతాల చెల్లింపులకు మరింత ఎక్కువ నిధులు అవసరమవుతాయి. ఇది రాష్ట్ర ఖజానాపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.కొన్నిసార్లు నిధుల నిర్వహణలో సరైన ప్రణాళిక లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల కూడా జీతాల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ప్రయత్నిస్తోంది. ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉద్యోగులకు అన్ని వాస్తవాలు తెలియజేసి, ఆర్థిక పరిస్థితులపై వారితో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల తెలిపారు.జూన్ 2021 నాటి సమాచారం ప్రకారం.. తెలంగాణలో దాదాపు 9.21 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు..తెలంగాణలో విద్యాశాఖ, హోంశాఖ, వైద్యారోగ్య శాఖ, రెవెన్యూ శాఖల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఈ శాఖల ఉద్యోగుల జీతాల కోసం ఎక్కువ నిధులు ఖర్చు అవుతున్నాయి.

# సంపాదకీయం

## ఆ రెండు పార్టీల్లో నాయకత్వ సంక్షోభం


డొనాల్డ్ ట్రంప్ తన సుంకాలను ప్రకటించినప్పటి నుండి ప్రపంచం గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటోంది. భయంకరమైన అనిశ్చితిలో మునిగిపోయింది.మెక్సికో వంటి చిన్నదేశాలు సైతం ట్రంప్ ధోరణులను ఎండగడుతూ ఎదురు దాడులకు దిగుతున్నారు. కానీ, ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత దేశ నాయకులు మాత్రం నిస్తేజంగా కనిపిస్తున్నారు. తమ రాజకీయ మనుగడ కోసం దగ్గరిదారులు వెతుకుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గత వారం తన నియోజక వర్గాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎక్కువగా ఆధ్యాత్మిక పోస్టులను సోషల్ మీడియాలో చేశారు. మహావీర్ జయంతి నాడు, 'భగవాన్ మహావీర్ ఆదర్శాలు నాతో సహా లెక్కలేనన్ని మందికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి' అని పోస్ట్ చేశారు. వారణాసి నుండి, ప్రధానమంత్రి హనుమంతుడి జన్మదినం నాడు సంకట్ మోచన్ మందిరాన్ని సందర్శించగలిగినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ విశ్వనాథుని ఆశీర్వాదాలు తన నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడానికి తనను ఎలా ప్రేరేపించాయో చెప్పారు. కొత్త వక్ఫ్ చట్టం, ప్రభుత్వం సాధించిన విజయాలు వంటి అంతర్గత అంశాలపై కొన్ని రాజకీయ అంశాలను కూడా ప్రస్తావించినా ప్రపంచాన్ని ఆర్థిక గందరగోళానికి నెట్టివేస్తున్న తన 'మిత్రుడు' ట్రంప్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేకపోతున్నారు. ట్రంప్ సుంకాల ప్రభావం గురించి ప్రతిపక్షాలు కోరినా పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సాహసింపలేదు. ఈ గందరగోళం నుండి భారతదేశ ప్రజలకు తగు రక్షణ కల్పిస్తానని ఒక్కసారి కూడా భరోసా ఇచ్చే ప్రయత్నం చేయలేదు. మరోవంక, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 84వ సమావేశంలో పాల్గొంటూ సుదీర్ఘమైన, ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు గాని అందులో కూడా ఈ సుంకాల గురించి ప్రస్తావించలేదు. కులజనాభా గణన, 50 శాతం పరిమితికి మించి దిగువ కులాలకు రిజర్వేషన్లు, దళితులు, ఒబిసిలు, గిరిజనులు నరేంద్ర మోడీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కారణంగా ఆర్థికంగా ఎదగలేకపోవడం వంటి అంశాలకు పరిమితమయ్యారు. సుంకాలను ప్రస్తావించినా ట్రంప్ తన స్నేహితుడు మోడీని ఎలా నిరాశపరిచాడో ఎగతాళి చేయడానికి పరిమితమయ్యారు. తన సమక్షంలోనే డొనాల్డ్ ట్రంప్ సుంకాలను పెంచే తన ప్రణాళికల గురించి చెబుతున్నా ప్రధాని నిశ్శబ్దంగా కుర్చున్నారంటూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో అటు బిజెపిలో మోడ, ఇటు కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ నాయకత్వాల పట్ల విశ్వాసం సన్నగిల్లుతుంది. మరో నాయకత్వం వైపు ఆయా పార్టీ శ్రేణులు చూస్తున్నారు. దానితో వారిద్దరూ దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యల పట్ల దృష్టి సారించే పరిస్థితులలో లేరని చెప్పవచ్చు. అంతకు ముందే ప్రధాని మోడీ నాగ్‌పూర్ పర్యటన సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి, ఆ సంస్థ నాయకత్వంతో ఏర్పడిన అగాధాన్ని పూడ్చుకునే ప్రయత్నం చేశారనే వార్తలు వచ్చాయి. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి సంస్థాగతంగా బలం పుంజుకుందని, గతంలో మాదిరిగా తమకు ఆర్ఎస్ఎస్ అండదండలు అవసరం లేదని, తమ వ్యవహారాలను తామే చూసుకోగలమని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఒక ఇంటర్వ్యూలో పేర్కొనడం సంఘ్‌పరివార్‌లో కలకలం రేపింది. దాని ప్రభావంతోనే 400 సీట్లతో గెలుస్తామని 'మోడీ గ్యారంటీ'గా చెప్పుకొంటూ ఎంతగా ప్రచారం చేసుకున్నా, 240 సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటుకు టిడిపి, జెడి(యు) వంటి పక్షాలపై ఆధార పడాల్సివచ్చింది. ఇక మోడీ సారథ్యంలో బిజెపికి భవిష్యత్ లేదనే అభిప్రాయాలు బలం పుంజుకొని వస్తున్నాయి. ఆ తర్వాత జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో అసంభవం అనుకున్న విజయాలను బిజెపి సాధించడం వెనుక ఆర్ఎస్ఎస్ కార్యకర్తల వ్యూహాత్మక పనితీరే కారణం అని స్పష్టం కావడంతో ఇప్పుడు తమ భవిష్యత్ గురించి బిజెపి నేతలు ఆ సంస్థ వైపు చూడటం ప్రారంభించారు. గతంలో ప్రధాన మంత్రిగా పలు సందర్భాలలో నాగ్‌పూర్ సందర్శించిన మోడీ ఏనాడూ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సందర్శించే ప్రయత్నం చేయలేదు. అందుకనే 12 ఏళ్ళ తర్వాత ఇపుడు సందర్శించడం, ఈ సందర్భంగా తమ పరిపాలన తీరుపై పలు ప్రశ్నలను ఎదుర్కోవాల్సి రావడంతో ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తున్నది. కొన్ని అంశాలపై గతంలో సైతం ఆర్ఎస్ఎస్– బిజెపిల మధ్య అంతరాలు ఏర్పడినప్పటికీ వాజపేయి హయాంలో పరస్పరం చర్చల ద్వారా అపరిష్కరించుకొనే వారు. నాటి ఆర్ఎస్ఎస్ అధినేత సుదర్శన్ నేరుగా వాజపేయిని కలిసి పరిష్కారం కనుగొనేవారు. ఏనాడూ సుదర్శన్ సూచనలను వాజపేయి పక్కనపెట్టిన ఉదంతాలు లేవు. వాజపేయి తన మంత్రివర్గంలో జస్వంత్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా తీసుకోవాలని రాష్ట్రపతి భవన్ మంత్రుల జాబితాను పంపిన అనంతరం సుదర్శన్ కలిసి ఎన్నికల్లో ఓటమి చెందిన వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటే తప్పుడు సంకేతాలు వెడతాయని వారిస్తే, వంటనే ఆ పేరు మార్చారు. కానీ మోడీ తన మొదటి మంత్రివర్గంలో ఎన్నికల్లో ఓటమి చెందిన అరుణ్ జైట్లీ వంటి వారిని ఏకపక్షంగా తీసుకున్నారు. గత 11 ఏళ్ళల్లో ఏనాడూ వ్యక్తిగతంగా ఆర్ఎస్ఎస్ అధినేత డా. మోహన్ భగవత్‌తో కలిసి విధానపర అంశాలపై మోడీ సమాలోచనలు జరిపిన ఉదంతాలు లేవు. అందుకనే నేడు తమ మధ్య అగాధం ఏర్పడినట్లు గ్రహించినట్లు కనిపిస్తున్నది. దేశంలో అన్నిరాజకీయ పార్టీలు కుటుంబ పార్టీలుగా మారాయని భావిస్తున్న సమయంలో ఏకైక ప్రజాస్వామ్య పార్టీగా భావిస్తున్న బిజెపిలో సంస్థాగత ఎన్నికలలో ఏర్పడిన ప్రతిష్టంభన ఈ సందర్భంగా మోడీ నాయకత్వంపై నీలినీడలు ప్రసరింపచేస్తున్నాయి. బిజెపి అధ్యక్ష పదవి కాలపరిమితి మూడేళ్లు మాత్రమే. కానీ గత 11 ఏళ్ళల్లో ఇద్దరు మాత్రమే అధ్యక్షులుగా ఉన్నారు. ప్రస్తుత అధ్యక్షుడి కాలపరిమితి గత ఏడాది ప్రారంభంలోనే పూర్తయినా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకొనే సాహసం చేయలేక పోతున్నారు. 75 సంవత్సరాలకు పదవులను త్యజించాలనే వరవడిని ఏర్పాటు చేసిన మోడీ ఇప్పుడు తానే ఆ పరిస్థితి ఎదుర్కోవాల్సి రావడం ఈ ప్రతిష్టంభనకు మూల కారణంగా కనిపిస్తోంది. కొత్త ప్రధాని విషయం తేలితే గాని, కొత్త అధ్యక్షుడి విషయం తేలదని చెబుతున్నారు. గతంలో బిజెపిలో సంస్థాగత కార్యక్రమాలు నియమబద్ధంగా జరుగుతూ ఉండెడివి. ప్రతి ఏడాది రెండు సార్లు జాతీయ మండలి, మరో రెండు సార్లు జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతూ ఉండెడివి. కానీ ఇప్పుడు మొక్కుబడిగా మాత్రమే జరుగుతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం ఇప్పటివరకు బిజెపి పార్లమెంటరీ సమావేశం జరగకపోవడం గమనార్హం. సభ నాయకుడిని ఓ పార్టీ ఎంపిలు ఎన్నుకొని, ప్రభుత్వం ఏర్పాటుకు ఇతర పార్టీల మద్దతు తీసుకోవడం ప్రజాస్వామ్యంలో ఆనవాయితీ. కానీ మొదటిసారిగా, గత ఏడాది మోడీని ఎన్నికల అనంతరం తమ నాయకుడిగా బిజెపి ఎంపిలు కాకుండా ఎన్‌డిఎ ఎంపిలు ఉమ్మడిగా ఎన్నుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రతి బుధవారం జరిగే బిజెపి ఎంపిల సమావేశానికి బదులుగా ఇప్పుడు ఎన్‌డిఎ ఎంపిల సమావేశాలు జరుగుతున్నాయి. బిజెపి ఎంపిల సమావేశాలు జరిపితే ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు కురిపించేందుకు సిద్ధంగా కొందరు పార్టీ ఎంపిలు ఉన్నారనే భయంతోనే ఈ విధంగా చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మోడీ బలమైన నాయకుడిగా అంతర్జాతీయంగా ప్రచారం పొందారు. రాజకీయంగా ఆయన ప్రభుత్వానికి అడ్డు అంటూ లేదు. అయిన ప్పటికీ కీలకమైన సమస్యలపై ఈ ప్రభుత్వం చురుకుగా వ్యవహరించడం లేదనే విమర్శలు చెలరేగుతున్నాయి. మణిపూర్‌లో రెండేళ్లుగా రావణకాష్ఠంగా చెలరేగుతున్న హింసాయుత సంఘటనల విషయంలో, ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో మొత్తం పాలనా యంత్రాంగం కేంద్రం కనుసన్నలలో నడుస్తున్నా దాదాపు ప్రతిరోజూ ఉగ్రవాదులతో కాల్పులు జరుగుతూ ఉండటం, ఎప్పుడో సమాధి అయినా ఖలిస్థాన్ తీవ్రవాదం తిరిగి పడగ విప్పడం, ఉత్తరాదిన రైతులలో అసంతృప్తి కొనసాగుతూ ఉండడం.. సమస్యల పరిష్కారంలో ఈ ప్రభుత్వ సామర్థ్యంపై ప్రశ్నలను తలెత్తే విధంగా చేస్తున్నది. మరోవంక, కాంగ్రెస్‌లో బాధ్యత లేకుండా పెత్తనం చెలాయింప చూస్తే రాహుల్ గాంధీ నాయకత్వం పట్ల విశ్వాసం సన్నగిల్లుతుంది. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పరాజయానికి బిజెపి అనుసరించిన ఎత్తుగడల ప్రభావం ఒక కారణమైతే, రాహుల్ బృందం అనుసరించిన అసమర్థ విధానాలు మరో కారణంగా ఆ పార్టీ నేతలు గుర్తిస్తున్నారు.

# దేశాధ్యక్షుడు అయిన తత్వవేత్త



డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ (సెప్టెంబర్ 5, 1888 – ఏప్రిల్ 17, 1975) భారత దేశపు మొట్ట మొదటి ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని పేరెన్నిక గన్న మహా మహోపాధ్యాయుడు. రెండు పర్యాయాలు ఉప రాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారత దేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) నాటి ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు. మహా మేధావిగా, గొప్పవ్యక్తిగా, గొప్ప గ్రంథకర్తగా, తత్వవేత్తగా, ప్రపంచ దేశాల మన్ననను అందుకున్న రాధాకృష్ణన్ భారతీయ మహర్షుల కోవకు చెందిన వారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5– 1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళ నాడుకు వలస వెళ్లిన తెలుగు దంపతులు అయిన సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరా స్వామి ఒక జమీందారీలో తహసిల్దార్. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యా భ్యాసము ఎక్కువగా తిరుత్తణి, తిరుపతిలోనే గడిచి పోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగు చోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందారు. బాల్యం నుండి అసాధారణమైన తెలివి తేటలు కలవారాయన. 21 సంవత్సరాలైనా దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యారు. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను తెలుసుకుని, మైసూరు విశ్వ విద్యాలయం ఉపకులపతి హెచ్.వి.నంజుందయ్య ఆయనను పిలిపించి ప్రొఫెసర్ గా నియమించారు. ఆయన ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని, డా. అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్‌లు కోరారు. దాంతో అతను కలకత్తా వెళ్ళారు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్యుడుగా వున్నప్పుడు అతను 'భారతీయ తత్వశాస్త్రం' అన్న గ్రంథం వ్రాశారు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంసలందుకున్నది. 1931లో డా. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సిలర్‌గా పనిచేశారు. అప్పట్లో డా. రాధాకృష్ణన్ పిలుపును అనుసరించి ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, హుమయూన్ కబీర్ వంటి మేధావులు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేశారు. 1931లోనే రాధాకృష్ణన్ "లీగ్ ఆఫ్ నేషన్స్ 'ఇంటలెక్చ్యుయల్ కో–ఆపరేషన్ కమిటి'" సభ్యులుగా ఎన్నుకోబడినారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్య మతాల గౌరవ అధ్యాపకునిగా అయినారు. చైనా, అమెరికా దేశాల్లో పర్యటించి పెక్కు ప్రసంగాలు చేశారు. 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు అయినారు. 1947 ఆగస్టు 14–15తేదీన మధ్య రాత్రి 'స్వాతంత్ర్యోదయం' సందర్భాన రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం సభ్యులను ఎంతో ఉత్తేజపరిచింది. 1949లో భారత దేశంలో ఉన్నత విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వం ఒక కమిటి నియమించింది. దానికి అధ్యక్షుడు డా. రాధాకృష్ణననే. డా.రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ కోరిక మేరకు 1952–62 వరకు భారత ఉప రాష్ట్రపతిగా పనిచేశారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టిన రోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని అతను కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును "ఉపాధ్యాయ దినోత్సవం"గా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. రాధాకృష్ణన్ ది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారి వృత్తి చేయ మన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతి లోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ చదువంతా ఉపకార వేతనాల తోనే సాగి పోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో అతను నేలను శుభ్ర పరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగి యిచ్చేవారు. ఆయన దృష్టిలో తత్వము అనేది జీవితాన్ని అర్థం చేసు కోవటానికి ఒక మార్గము, భారతీయ తత్వమును అర్థం చేసు కోవటం అనేది ఒక సాంస్కృతిక చికిత్సగా భావించే వారు. భారతీయ ఆలోచనా దృక్పథాన్ని పాశ్చాత్య పరిభాషలో చెప్పి, అందులో వివేకము, తర్కము ఇమిడి ఉన్నాయని చూపించి, భారతీయ తాత్విక చింతన ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తాత్విక శాస్త్ర ఉపన్యాసకుడిగా, ఉప ప్రాధ్యాపకుడిగా, ప్రాధ్యాపకుడిగా వివిధ పదవులను అలంకరించారు. 1918 నుండి 1921 వరకు మైసూరు విశ్వ విద్యాలయంలో తత్వశాస్త్ర ప్రాధ్యాపకుడిగా (ప్రొఫెసర్) పని చేసారు. 1921లో, అప్పటి భారతదేశం లోని కలకత్తా విశ్వ విద్యాలయంలో ముఖ్య తాత్విక పీఠమైన, కింగ్ జార్జ్ 5 చెయిర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్ కు రాధాకృష్ణన్‌ను నియమించారు. 1926 జూన్‌లో బ్రిటనులో జరిగిన విశ్వ విద్యాలయాల కాంగ్రెసులో కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. తరువాత ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డు విశ్వవిద్యాలయం నిర్వహించే అంతర్జాతీయ తాత్విక కాంగ్రెస్‌లో సెప్టెంబర్ 1926లో కూడా కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా పని చేసారు. 1936లో, స్పాల్డింగ్ ప్రొఫెసర్ ఆఫ్ ఈస్టర్న్ రిలీజియన్స్ అండ్ ఎథిక్స్ అనే పీఠంలో ఆక్స్‌ఫర్డు విశ్వ విద్యాలయంలో 1952లో భారతదేశ ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించే వరకు కొన సాగారు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా, 1949 నుండి 1952 వరకు రష్యాలో భారత రాయబారిగా పని చేసారు. 1946 నుండి 1950 వరకు పలుమార్లు భారతదేశం తరుపున యునెస్కో సభ్యబృందానికి అధ్యక్షత వహించారు. 1948లో విశ్వ విద్యాలయాల విద్యా కమిషనుకు అధ్యక్షుడిగా భారత ప్రభుత్వంచే నియమింప బడ్డారు. 1948లో యునెస్కో కార్యనిర్వాహక బృందానికి అధ్యక్షుడిగా ఉన్నారు. 1952లో యునెస్కో అధ్యక్షునిగా ఎంపిక అయ్యాడు. 1962లో బ్రిటీషు ఎకాడమీకి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. 1931లో బ్రిటీషు ప్రభుత్వం వారు ఇచ్చే ప్రతిష్ఠాత్మక "సర్" బిరుదు ఆయనను వరించింది. 1954లో మానవ సమాజానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా భారత దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "భారతరత్న" బిరుదు పొందారు. 1961లో జర్మనీ పుస్తక సదస్సు యొక్క శాంతి బహుమానం పొందారు. 1963 జూన్ 12న బకింగ్ హామ్ ప్యాలెస్ లోని ఆర్డర్ ఆఫ్ మెరిట్‌కి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలయిన ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి, మొదలయిన వాటి నుండి వందకు పైగా గౌరవ పురస్కారాలు, డాక్టరేటులు సంపాదించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి బెంజమిన్ ఫ్రాంక్లిన్



బెంజమిన్ ఫ్రాంక్లిన్ (జనవరి 17, 1706 – ఏప్రిల్ 17, 1790) అమెరికా విప్లవంలో పాల్గొని అమెరికా దేశాన్ని, రాజ్యాంగాన్ని స్థాపించిన విప్లవకారుల్లో ఒకడు. ఆయన బహుకళా ప్రావీణ్యుడు, గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి. ఆయన కనిపెట్టిన వాటిలో "ఛత్వారపు కళ్ళద్దాలు", "ఓడోమీటర్ (ప్రయాణించిన దూరాన్ని సూచించేది)" మొదలగునవి చాలనే ఉన్నాయి. అగ్నిమాపక విభాగం, తపాలా సేవ, ఆసుపత్రి, లైబ్రరీ, అకాడమీ స్థాపనలో ఫ్రాంక్లిన్ ప్రధాన పాత్ర పోషించాడు. ఫ్రాంక్లిన్ "మొదటి అమెరికన్" అనే బిరుదుని కూడా పొందాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ 1706 జనవరి 17 ఆదివారం మసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో జన్మించాడు. పిడుగులు పడి ఎన్నో విలువైన కట్టడాలు కూలిపోతూ ఉందడాన్ని చూసిన ఆయన, పిడుగుల బారి నుండి కట్టడాలను కాపాడటం కోసం "లైట్నింగ్ కండక్టర్" లను తొలిసారిగా 1752లో రూపొందించాడు. సముద్రం మీద కూడా ఎన్నో రకాల పరిశోధనలు చేసి సముద్రంలో చమురు వేస్తే దాని అలజడి తగ్గుతుందని కనుగొన్నాడు. ఆయన రూపొందించిన స్టౌవ్ లు, బై ఫోకల్ కంటి అద్దాలు ఇప్పటికీ వాడబడుతూ ఉన్నాయి. ఆమ్లీకృతంగా ఉన్న భూములలో సున్నం కలిపి తటస్థం చేయవచ్చని సూచించాడు. గాలి, వెలుతురు లేని చోట్ల అంటువ్యాధులు త్వరగా ప్రబలుతాయని కూడా హెచ్చరించాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తండ్రి బెన్ బోధకుడిగా మారాలని కోరుకున్నాడు. ఎనిమిదేళ్ళ వయసులో అతన్ని వ్యాకరణ పాఠశాలకు పంపాడు. పది సంవత్సరాల వయస్సు వరకు కొత్త పాఠశాలలోనే ఉన్నాడు. తన పాఠశాల రోజుల నుండి, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఒక నావికుడు కావాలను కున్నాడు. అతని తండ్రి అంగీకరించ లేదు. బెన్‌ను తన అన్నయ్య ప్రింటింగ్ షాపులో నేర్చుకోవడానికి పంపాడు. బెన్ ఫిలడెల్ఫియా, తర్వాత ఇంగ్లాండ్‌లో ఈ అభ్యాసాన్ని కొనసాగించాడు. చివరికి ఫిలడెల్ఫియాలో తన సొంత ముద్రణ వ్యాపారాన్ని స్థాపించాడు. రాజకీయాలతో సంబంధం పెట్టుకునే ముందు, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఫిలడెల్ఫియాలో ఒక ప్రింటింగ్ షాపును కలిగి, 1747 లో ప్రింటింగ్ నుండి రిటైర్ అయ్యాక, ఫిలడెల్ఫియా యొక్క పోస్ట్ మాస్టర్, బ్రిటిష్ నార్త్ అమెరికా కో–డిప్యూటీ పోస్ట్ మాస్టర్ గా కూడా పనిచేశాడు. 1775 లో, అతను యునైటెడ్ స్టేట్స్ యొక్క మొదటి పోస్ట్ మాస్టర్ జనరల్ అయ్యాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ సుదీర్ఘ ఆవిష్కరణల జాబితాలో బైఫోకల్స్, మెరుపు రాడ్, గ్లాస్ అర్మోనికా, ఒక లైబ్రరీ కుర్చీ, ఈత రెక్కలు, దీర్ఘకాల పరికరం, ఫ్రాంక్లిన్ స్టవ్, కాథెటర్ తదితరులు ఉన్నాయి. 1741 లో, బెన్ ఫ్రాంక్లిన్ స్టవ్ అనే ఇనుప కొలిమిని కనుగొన్నాడు. బెన్ వయసు పెరిగేకొద్దీ అతని దృష్టి క్షీణించింది. అతను చదవడానికి ఇష్టపడ్డాడు. రెండు జతల గ్లాసుల మధ్య మారడం అలసి పోయాడు. ఒకటి విషయాలు దగ్గరగా చూడటానికి అతనికి సహాయ పడింది, మరొకటి దూరంగా చూడటానికి. అందువల్ల అతను రెండు జతల నుండి కటకములను సగానికి కట్ చేసి, ఆపై ప్రతి లెన్స్‌లో సగం ఒకే చట్రంలో ఉంచి, బైఫోకాల్స్‌ను కనుగొన్నాడు. తన జీవిత కాలంలో, బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనేక రచనలు చేశాడు. బాగా తెలిసిన వాటిలో పూర్ రిచర్డ్ యొక్క అల్మానాక్ , రిచర్డ్ సాండర్స్ అనే మారుపేరుతో రాసిన వార్షిక ప్రచురణ తదితరాలు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, పెన్సిల్వేనియా హాస్పిటల్ మరియు ఫ్రాంక్లిన్ మరియు మార్షల్ కాలేజీని స్థాపించారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తన జీవిత కాలంలో అనేక అంతర్జాతీయ ప్రయాణాలు చేశాడు. 1776–84: ఫ్రాన్స్‌కు అమెరికన్ కమిషనర్‌గా పనిచేస్తూ, ఫ్రాన్స్‌తో కూటమి ఒప్పందంపై చర్చలు జరిపారు. ఫ్రాంక్లిన్ సుభాషితాలలో.... మరణానంతరం కూడా గుర్తుండాలంటే చదవదగిన పుస్తకాలు వ్రాయి లేదా వ్రాయదగిన పనులు చెయ్యి. తృప్తి పేదవాడ్ని ధనవంతుడిగా చేస్తుంది. అసంతృప్తి గొప్పవాణ్ణి పేదవాడిగా మారుస్తుంది. కోపంతో మొదలుపెట్టిన పని తప్పనిసరిగా అవమానాల పాలౌతుంది. ఖాళీ సమయం కావాలనుకుంటే సమయాన్ని సరిగ్గా వినియోగించు కోవాలి. కారణం లేకుండా ఎవరికి కోపం రాదు. అయితే ఎప్పుడో గాని సరైన కారణం ఉండదు. సహనం కలవాడు ఏదైనా సాధించగలడు. మంచి యుద్ధం, చెడ్డ శాంతి అనేది ఎప్పుడూ ఉండదు... ఆయనకు జీవిత కాలంలో ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ లో అతను సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. అమెరికా స్వాతంత్ర్యం కోసం కృషి చేసి, 1766 జూలై 4న స్వాతంత్ర్య ప్రకటన చేస్తూ సంతకాలు చేసిన వారిలో ఫ్రాంక్లిన్ కూడా ఉన్నాడు. 1777 లో రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ఇతను కూడా ఎంతగానో సహకరించాడు. శాస్త్రవేత్తగా, రాజకీయవేత్తగా పరిణితి చెందిన ఆయన 1770 ఏప్రిల్ 17న మరణించాడు.

# అక్రమమట్టి తవ్వకాలను అడ్డుకున్న తహసిల్దార్





**నిజాంపేట,ఏప్రిల్16(సూర్యరేఖ)** అక్రమంగా తరలిస్తున్న మట్టిని అడ్డుకున్న సంఘటన నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో చప్పేటి కుంటలో బుధవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా తాహసిల్దార్ రమ్యశ్రీ తెలిపిన వివరాల ప్రకారం..నమ్మదగిన సమాచారం మేరకు గ్రామంలోని చప్పేటి కుంట లో ఒక జెసిపి రెండు ట్రాక్టర్లు అక్రమంగా మట్టిని తరలిస్తుండగా అడ్డుకున్నామని, అట్టి వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించామన్నారు. ఎవరైనా అక్రమంగా మట్టి తరలించినట్లయితే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలి






**ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..**

**నిజాంపేట,ఏప్రిల్16(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చురాజుపల్లి,జెడ్చెరువు తండా, గ్రామలలో బుధవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకెపి సీసీ లక్ష్మి,చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పాటించాలని,రైతన్నలకు సూచించారు.ప్రభుత్వం వద్ద మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, బ్రిగేడు ధాన్యానికి 2300, కేటాయించడం జరిగిందని,రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రమ్య,ఈ ఐకెపి అధ్యక్షురాలు స్వప్న,సిఏ మంజుల,కోశాధికారి సుమలత,ఓబి రాజేశ్వరి,సుదామల్లేషం,కార్యదర్శి రాము,శ్రీనివాస్ నాయక్,రాజు,యాదగిరి,నరేష్, ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ అయ్యప్ప స్వామి పునఃనిర్మాణానికి కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ రూ.లక్ష 116 రూ.లు విరాళం





**రామంతాపూర్,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** రామంతాపూర్ గోఖలేనగర్ లో అయ్యప్ప స్వామి ఆలయాన్ని పునఃనిర్మాణం చేపడుతున్నారు. అయ్యప్ప స్వామి ఆలయానికి రూ.1,లక్ష 116 వేలు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ. అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి 1,00,116 ఇవ్వడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని,ఆలయ పునర్నిర్మానానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ గంధం నాగేశ్వరరావు, దయాకర్ రెడ్డి,ఎదుల కొండల్ రెడ్డి,కొక్కొండ జగన్, బోసాని పవన్, శ్యామ్, బంటీ గౌడ్,ప్రధాన అర్చకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ పోలీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ - 2025 క్యాలెండర్ ఆవిష్కరించిన

**కమిషనర్ సుధీర్ బాబు**



**ఉప్పల్,ఏప్రిల్16(సూర్యరేఖ)** రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ - 2025 క్యాలెండర్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్, ఆర్ పిసిసిఎస్ అధ్యక్షుడు సుధీర్ బాబు బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాచకొండ పోలీస్ కోపరేటివ్ సొసైటీకి సంబంధించిన ఆర్థిక సంవత్సరం 2024-25 ఆడిట్‌ను త్వరితగతిన ప్రారంభించి, సభ్యులకు త్రిఫ్ట్ పైన వడ్డీ,షేర్‌లపై డివిడెండ్ త్వరలో అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్ (అడిషనల్ డిసిపి,అడ్మిన్),ట్రెజరర్ బాలరాజ్,డైరెక్టర్లు సంగి వలరాజు,రవీందర్ రెడ్డి,సువర్ణ,లక్ష్మీ ప్రసన్న,సొసైటీ అకౌంట్స్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## బచ్చు రాజు పల్లి లో వందల నాటి మర్రిచెట్టు..



**నిజాంపేట,ఏప్రిల్16(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చురాజ్ పల్లి గ్రామంలో వందల ఏళ్ల నాటి ఊడల మర్రిచెట్టు ఎకరా స్థలంలో విస్తీర్ణమై ఉంది.పూర్వీకుల కాలం నాటి నుండి ఉన్న ఈ చెట్టు నీడలో గ్రామస్తులు సేదతీరుతూ ఉంటారు. మండలంలో ఇంత పెద్ద మర్రిచెట్టు ఉండడం విశేషం.. ఈ చెట్టు కింద గొల్ల కురుమల ఆరాధ్య దైవం అయినటువంటి బీరప్ప స్వామి కొలువుదీరాడు.ప్రతి సంవత్సరం బీరప్ప ఉత్సవాలు చెట్టు నీడన ఘనంగా నిర్వహిస్తారు.

## న్యాల్కల్ మండల కేంద్రంలో చూడముచ్చటగా ఎల్లమ్మతల్లి నాటకం..



**అందోల్,ఏప్రిల్ 16(సూర్యారేఖ)** న్యాల్కల్ మండల కేంద్రంలో ఘనంగా ఎల్లమ్మతల్లి నాటకంకు భారీగా హాజరైన భక్తులు భక్తి పరవశంతో సాగిన అట అట నేర్పిన పంతులు మాందపూర్ రాజుకు అభినందనలు తెలిపారు. వివిధ గ్రామాల ప్రజలు టబ్ల పంతులు పరమేష్, హార్మోనియం పంతులు అశోక్,జైపాల్ మంచి సంగీతని అందిస్తూ మంచి ప్రతిభ కనబరిచి అటకు వచ్చిన భక్తులతో శబాష్ అని అనిపించుకున్నారు. నాటక మండలి సభ్యులకు అట నేర్పిన పంతులు రాజుకు టబ్ల మాస్టర్ హార్మోనియం మాస్టర్స్ అశోక్ జైపాల్ కు జర్నలిస్ట్ శేఖర్ కు కుప్పనగర్ ఎల్లమ్మతల్లి గుడి నిర్మాణము దాత పూజారి నర్సింలు ఘనంగా సన్మానం చేసారు.వారికీ నాటక మండలి సభ్యులు హృదయపూర్వక వందనాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాల్కల్ రాయికోడ్ మండలం జరసంగం, దూరప్రాంతాలనుండి భక్తులు వచ్చి ఆటను ఆసక్తితో తిలకించారు.ఆటను చూడడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి నాటకమండలి సభ్యులు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

## రాజీవ్ యువ వికాసంలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి..

**బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ను కలిసిన కరిపే పవన్ కుమార్ వంజరి**



**హబ్సిగూడ,ఏప్రిల్ 16(సూర్యరేఖ)** రాజీవ్ యువ వికాసంలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరిపే పవన్ కుమార్ వంజరి మంగళవారం బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు రాజీవ్ యువ వికాసం కార్యక్రమంలో బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ వంజరి మాట్లాడుతూ...రాష్ట్రంలోని బీసీ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.అయితే ఈ పథకంలో బీసీలకు కేటాయింపులు పెంచితే మరింత మంది నిరుద్యోగయువతకు లబ్ధి చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల సంక్షేమం కోసం ఇలాంటి పథకాలు తీసుకురావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని పవన్ కుమార్ పేర్కొన్నారు.


# ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం




**ఉప్పల్,ఏప్రిల్ 16(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవం జరిగింది.సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి,నవయుగ వైతాళికుడు..గద్య తిక్కన, ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటామని సభాధ్యక్షులు వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్ తెలిపారు. విద్యాత్మక విషయ సమన్వయ కర్త కె.గీత సర్వోత్తమ కళ అయిన నాటకం మొదలైన సాంస్కృతిక రంగాలలో కూడా విద్యార్థులు రాణించాలని కోరారు.తెలుగు విభాగాధిపతి జె.విశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ... ఆధుని కాంధ్ర సమాజ పితామహుడు, హేతువాది, మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన వ్యక్తిగా, మొట్టమొదటి సహవిద్యా పాఠశాల స్థాపకుడుగా, తెలుగులో మొదటి స్వీయ చరిత్రకారులుగా, తెలుగులో తొలి నవలాకారుడిగా తెలుగులో తొలి ప్రహసనకర్తగా, తెలుగుకవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తిగా, విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయితగా యుగకర్తగా కందుకూరి వీరేశలింగం పంతులు కీర్తిపొందిన మహనీయుడు అన్నారు. తెలుగు అధ్యాపకులు పి.ధనలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం భవనం పెద్దమ్మ తల్లి దేవాలయానికి స్థలం కేటాయించాలి..

**పరమేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులు..**



**ఉప్పల్,ఏప్రిల్ 16(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, కాంటెస్ట్ ఎమ్మెల్యే మందముల పరమేశ్వర్ రెడ్డిని బుధవారం రామంతపూర్ ముదిరాజ్ సంఘం ఐక్యవేదిక ప్రతినిధులు మర్యాదపూర్వ కంగా కలిశారు.అనంతరం ముదిరాజ్ సంఘం భవనం,పెద్దమ్మ తల్లి దేవాలయానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ. తమంత ఐక్యంగా నిలిచి నిర్మించుకుంటామని పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు.ముదిరాజ్ సంఘానికి భవనం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని వారు తెలిపారు.పరమేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ప్రభుత్వం తరపున స్థలం కేటాయించేలా అవసరమైన చర్యలు తీసుకుంటారని హామీ ఇవ్వడం పట్ల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రామంత పూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొంపల్లి ఉపేందర్,ప్రధాన కార్యదర్శి కల్మకాళ్ల లింగం ముదిరాజ్,గాజుల సురేష్ ముదిరాజ్,అడ్వైజర్ పిసరి శంకర్ ముదిరాజ్,వైస్ ప్రెసిడెంట్ ప్యాట మురళీకృష్ణ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ కటికల చంద్రకాంత్ ముదిరాజ్,సెక్రెటరీ గాజుల ప్రవీణ్ కుమార్ ముదిరాజ్,మీడియా సెల్ కొరిమి దినేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలి

**సివిల్ సప్లై,ఫుడ్ ఇన్ స్పెక్టర్ అధికారులు తనిఖీలు చేపట్టాలి..**



**బెల్లంపల్లి,ఏప్రిల్16 (సూర్యరేఖ)** వంట గ్యాస్ సబ్సిడీ వెంటనే విడు దల చేయాలని కోరుతూ తెలుగు దేశం పార్టీ తాండూర్ మండల అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ బుధవారం తాండూర్ తాహసి ల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసిల్దార్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభు త్వం ప్రజలకు సబ్సిడీ రూపంలో వంట గ్యాస్ ను అందజేస్తుందని అన్నారు.పంట గ్యాస్ సిలిండర్ ధర రూ.927 ఉండగా అందులో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.327 గ్యాస్ వినియోగ దారుడి అకౌంట్‌లోకి రావాల్సి ఉండగా ప్రతినెల రావడం లేదని అన్నారు.సుమారుగా గత ఆరు నెలల నుండి సబ్సిడీ రాకపోవ డంతో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్థిక స్తోమత లేని వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అలాగే వంట గ్యాస్ సిలిండర్లు బ్లాక్‌లో ఎక్కువ ధరలకు అమ్మకుండా ఇతర వ్యాపార సముదాయాలకు విక్రయించ కుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సివిల్ సప్లై,ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికా రులు నేటి వరకు మండలంలో తనిఖీలు చేసిన దాఖ లాలు లేవని,ఎక్కడ కేసులు నమోదు చేసిన ఆనవాళ్లు కూడా లేవన్నారు. జిల్లా వ్యాప్తంగా వీరి తనిఖీల వార్తలు ఎప్పుడు వినలేదని అన్నారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్ కి నివేదించాలని తాండూర్ తాసిల్దార్‌ని కోరడమైనదని దాసరి (డిఎస్) శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బెల్లంపల్లి గ్యాస్ ఏజెన్సిలో ఘరణ మోసం



**బెల్లంపల్లి,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ భారత్ గ్యాస్ ఏజెన్సీలో ఘరణ మోసాలు జరుగుతున్నాయని వెలుగులోకి వచ్చాయి.కన్నెపల్లి మండల్ కోణంపల్లి గ్రామంకు చెందిన కొండగొర్ల రాజుబాయి అనే మహిళా వృద్ధురాలు కుమారుడైన చంద్రశేఖర్ ఈనెల 15న గ్యాస్ బుకింగ్ చేయడానికి ఏజెన్సీకీ వచ్చి గ్యాస్ బుక్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కొండగొర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ...గ్యాస్ ధర రూ.927 కాగా నేను రూ.1000 ఇచ్చి గ్యాస్ బుకచేస్కున్నానని,తిరిగి నాకు రావాల్సిన రూ.73 బదులు రూ 70 ఇచ్చి చిల్లర లేవని చెప్పి ఇవ్వడం లేదు.ఒక్కొక్కరి వద్ద రూ.3 చొప్పున గ్యాస్ ఏజెన్సిలో మోసాలతో కొన్ని లక్షల రూపాయలు దండుకుంటున్నారు.మా గ్యాస్ కనెక్షన్ కు సురక్ష పైపు లేదని అట్టి పైపు మార్చాలని,ఒత్తిడీ చేసారన్నారు.కాని మా గ్యాస్ పైపుకు 2029 వరకు వారంటీ ఉందన్నారు.గ్యాస్ ఏజెన్సీ వారు అమాయ క కంజుమర్లను బెదిరిస్తు వారి గ్యాస్ బిజీనెస్ చేస్తున్నారన్నారు. గ్యాస్ సిలిండర్లు స్థానిక హెూటల్ యాజమాన్యానికి ఎక్కువ ధరలకు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు.ఇట్టి విషయంలో ఈనెల 15 తేదీ జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి ఆర్డీఓ,సివిల్ సప్లై డిపార్ట్మెంట్ లకు పిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపించి గ్యాస్ ఏజెన్సీ వారి చేతిలో మోసపోతున్న ప్రజలను న్యాయం చేయాలనీ వారు కోరారు.

## శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ హుండీ లెక్కింపు..



**బెల్లంపల్లి,ఏప్రిల్16(సూర్యరేఖ)** శ్రీ కోదండ రామాలయం బెల్లంపల్లి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులు వేసినటువంటి కానుకలను బుధవారం ఉదయం 11:00 గంటలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేవాదాయ శాఖ పరిశీలకుడు రంగురవి కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.హుండీలో వచ్చిన కానుకల వివరాలు అక్షరాల అరవై ఒక్క వేయి ఒక్క వంద ఆరు రూపాయలు(61106)వచ్చిన్నటుగా నిర్ధారించారు.ఇట్టి హుండీ యందు మిశ్రమ బంగారం,మిశ్రమ వెండి,విదేశీ కరెన్సీ గాని ఎలాంటివి రాలేదని తెలిపారు.అనంతరం యధావిధి హుండీలను సీలు వేసి మరల యద స్థానంలో ఉంచడం జరిగింది.హుండీ లెక్కింపునకు రామాలయం ఈవో రవికుమార్,గంగపురి ఈవో బాపురెడ్డి,ఇస్గాం ఈవో వేణుగోపాల గుప్తా, బెల్లంపల్లి రామాలయం ప్రధాన అర్చకులు వేణుగోపాల చారి, రామకృష్ణచారి,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా పూర్తి చేయాలి






**జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్**

**పరిగి,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం,భూ భారతి పతకం పరిశీలన నిమిత్తం బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి.రామ్మో హన్ రెడ్డి,తో కలిసి నియోజకవర్గం సుల్తాన్ పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.అనంతరం పరిగి మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుండి పలు విజ్ఞాపనలను స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...పరిగి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, సమస్యలన్నింటిని ప్రభు త్వానికి నివేదిస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మఇండ్లను పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయిస్తామని అన్నారు.పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ఉండేలా చూస్తామని తెలిపారు.ముఖ్యంగా పరిగి నియోజకవర్గ సమస్యలను దశలవారీగా స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కలిసి తహసిల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న 100 సంవత్స రాల పైబడిన పురాతన భవనాలను పరిశీలించారు.వీటి స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి లేదా ప్రభుత్వ ఆస్తుల సక్రమ వినియోగానికి చర్యలు తీసుకున్నందుకు పూర్తి వివరాలతో సర్వే నంబర్ తో కూడిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్టింగ్ చైర్మెన్ పరుశు రామ్ రెడ్డి,తహసిల్దార్ ఆనందరావు,మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య,మండల ప్రజా పరిషత్ అధికారి కరీం,సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# నకిలీ విత్తనాలపై అధికారుల చర్యలేవి







**సంబంధిత అధికారులపై మండిపడుతున్న రైతు సంఘ నాయకులు..**
**మామూళ్ల మత్తులో వ్యవసాయ శాఖ అధికారులు..**
**పోలీసులకు నకిలీ విత్తనాలు పట్టుపడితే గాని వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలలో చలనం లేదు..**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్ మంచిర్యాల,ఆసిఫాబాద్ జిల్లాలలో అటు ఆంధ్ర ప్రదేశ్ ఇటు మహారాష్ట్ర నుండి నకిలీ విత్తనాలు తెలంగాణకు సరఫరా చేస్తూ కొంతమంది వ్యాపారస్తులు,నకిలీ మూఠ సభ్యులు,టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులకు పట్టుబడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.పోలీస్ లు పట్టుకొని కేసులు నమోదు చేసిన వారు జైలుకు వెళ్లి వచ్చి మళ్లీ అదే తతంగాన్ని కొనసాగిస్తున్నారు.అంటే వారు ఈ దందాను పూర్తిగా వదిలి వేయాలి అంటే వ్యాపారాస్తులపై పీడి యాక్ట లాంటి కేసులు పెడితే తప్ప వీరు నామమాత్రపు కేసులకు లొంగరు అని రైతు సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీల లోపం వల్లనే నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతుందని వారు ఆరోపిస్తున్నారు. ఫర్టిలైజర్ షాప్ యజమానులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు మామూలు ఇస్తూ ఉండడం వల్లనే వారు ఫర్టిలైజర్ షాపులలో తనిఖీలు నిర్వహించకుండా నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని, రైతుల నకిలీ విత్తనాలతో పంటలు దిగుబడి రాక ఆత్మహత్యకు వ్యవసాయ శాఖ అధికారుల కారకుల అవుతున్నారని రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.పోలీసులకు పట్టుబడితే గాని రెండు రోజులు హడావుడి ప్రదర్శిస్తూ మళ్ళీ తనకేమీ పట్టనట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇప్పటివరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల్ దండా పెల్లి హాజీపూర్ జన్నారం ఫర్టిలైజర్ షాప్ లలో వ్యవ సాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు అన్నారు.ఫర్టిలైజర్ షాప్ యజమానులు రైతులకు విత్తనాలు సరఫరా చేసేటప్పుడు ఆధార్ కార్డు తీసుకుని రిజిస్టర్ లో నమోదు చేయవలసి ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తు న్నా వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలలో చలనం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పత్తి విత్తనాలు యూరియా టాస్కోఫోర్స్ పోలీసులకు పట్టుపడుతుంటే వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదు.తనిఖీలు చేసిన ఎందుకు నకిలీ విత్తనాలు దొరకడం లేదు. అనేదానిపై రైతు సంఘం నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాతో పాటు హాజీపూర్,దండపెల్లి, జన్నారం ప్రాంతాలలో అధికారులు నామమాత్రపు తనిఖీలు కాకుండా నిఘా ఏర్పాటు చేసి అక్రమాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు. ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ,అవగాహన సదస్సు ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పేరుకే ముంగట ఉన్న నలుగురిని తీసుకువెళ్లి ఆ సమావేశంలో కూర్చుండబెట్టి మేము రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులు మోసపోతున్నారని, సంవత్సరాల తరబడి వ్యవసాయ శాఖలో బదిలీలు లేకపోవడం వల్ల కొంతమంది వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్ షాప్ యజమానులతో కుమ్మక్కై నిబంధనాలను తుంగలో తొక్కుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని హాజీపూర్ రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాస్థాయి సంబంధిత అధికారులు తనిఖీలు వస్తున్నారన్న విషయము ఫర్టిలైజర్ షాప్ యజ మానులకు కొంతమంది కిందిస్థాయి అధికారులు సమాచారం ఇవ్వడంతో వారు తనిఖీలకు వచ్చే రోజే ఫర్టిలైజర్ షాప్ యజమానులు దుకాణాలను మూసివేసి ఏదో ఒక డొంక తిరుగుడు సమా ధానాలు చెబుతున్నారన్న ఆరోపణాలు వినిపిస్తున్నా యి.ఈ తతంగం దండ పెల్లి మండలం తాళ్ల పేటలో గతంలో జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సిపి రామగుండం, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు,ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేసి రైతులు మోసపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘ నాయకులు కోరుతున్నారు.

# ఉప్పల్ 789 సర్వే నంబర్ లో అక్రమ నిర్మాణాల కూల్చివేత




**ఉప్పల్,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** ఉప్పల్ మండల పరిధిలోని ఉప్పల్ లో కళ్యాణపురి లోని సర్వే నెంబర్ 789లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను ఉప్పల్ తహసిల్దార్ టి,వాణి రెడ్డి ఆదేశాల మేరకు ఆర్,ఐలు సామ్సన్ పాల్, ఎం,అశ్విని గౌడ్,జూనియర్ అసిస్టెంట్ ఎన్,నాగ లక్ష్మి, ఎం,అలి వేలు,రెవె న్యూ సిబ్బంది సత్యనారాయణ,స్వామి,లు భారీ పోలీసు బందోబస్తు నడుమ జేసీబీల సహాయం తో కూల్చివేతలు చేపట్టారు.3 రూమ్స్, ప్రహరి గోడలను నేలమట్టం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భూముల ను ఎవరు ఆక్రమించిన,ఆక్రమించేందుకు ప్రయ త్నించిన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విక్రయానికి పాల్పడ్డ..నిర్మాణాలు చేసిన ఊరుకు నే ప్రసక్తే లేదని,అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు

# సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం..



**రామాయంపేట,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రమేష్ చారి,గ్రామ కాంగ్రెస్ నాయకు లు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కమ్మరి రమేష్ చారి మాట్లాడుతూ. కాట్రియాల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా సీసీ రోడ్డులకు రూ.15 లక్షల నిధులు మంజూరు కావడానికి సహకరించిన మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఎమ్మెల్యే సహకారంతో కాట్రియా ల గ్రామనికి రూ.55 లక్షల వరకు సిసి రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు.గత ప్రభుత్వాలలాగా మాట ఇచ్చి తప్పడం కాదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తూ అభివృద్ధి సంక్షేమ వైపు పరుగులు పెట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కూడా ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందిస్తూ,తన సొంత నిధుల ద్వారా ఏ అర్ధరాత్రి ఫోన్ చేసిన స్పందిస్తూ ప్రజల బాగోగులు పట్టించుకోవడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు తీరుస్తున్నాడని ఎమ్మెల్యే పనితీరు పట్ల ప్రజల సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి,ఎమ్మెల్యే రోహిత్ రావుకు మరొకసారి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాట్రియాల సిద్దరాములు,పెంటయ్య, హనుమండ్లు చంద్రం ధ్యాగల సిద్ధిరాములు ఎల్లం రామయ్య రాజయ్య దుర్గా నాయక్,కట్ట బాబు,మద్ది శ్యామయ్య, శ్యాములు,దశరతం,కుమార్,నరేష్,బాబు,రాజు,స ంజీవులు,సతీష్,శ్రీకాంత్,శ్రీధర్,అనిల్,రంజిత్,గ్రా మ యువకులు ప్రజలు పాల్గొన్నారు.

## కోర్టుకు గైర్హాజరు అవుతున్న వ్యక్తి అరెస్ట్.. జిల్లా జైలుకు తరలింపు



**బెల్లంపల్లి,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** బెల్లంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కాంట్రాక్టర్ బస్తీకి చెందిన నలిగంటి దయాకర్ అనే యువకుడ్ని అరెస్టు చేసి బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడం జరిగిందని బెల్లంపల్లి 1 టౌన్ ఎస్ హెచ్ ఓ దేవయ్య తెలిపారు.నలిగంటి దయాకర్ అనే యువకుడిపై కేసు నమోదు కావడంతో అతను కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతుం డడంతో అతనిని పోలీసులు బుధవారం అరెస్టు చేయడం జరిగిందన్నా రు.అరెస్టు చేసిన ఆ యువకుడ్ని బెల్లంపల్లి జడ్జి ముందు హాజరు పరిచి అనంతరం ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ లక్షణాలతో వృద్ధుడు మృతి..




**రామాయంపేట,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** వడదెబ్బ లక్షణాలతో ఒక వృద్ధుడు మృతి చెందిన సంఘటన రామయంపేట పట్టణంలో చోటుచేసు కుంది.మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణానికి చెందిన ఎరుకల బాలయ్య (65) రోజు లేబర్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు.ఈ క్రమంలో గత రెండు మూడు రోజులుగా కొంత అస్వస్థతకు గురై ఇంటివద్ద ఉంటున్నట్టు తెలిపారు.మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబీకుడు తెలిపారు. ఎండలు విపరీతంగా కొడుతున్న ఈ సమయంలో రోజు కూలి లేబర్ పనులు చేస్తున్న బాలయ్య వడదెబ్బ తగలడం చనిపోయాడని మృతుని భార్య బాలవ్వ,కుమారులు శంకర్,రమేష్, మహేష్ తెలిపారు.మృతుని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు బైరం శంకర్ పరామర్శించారు.

## అంగన్వాడీ పోషణ పక్షం భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం



**రామాయంపేట,ఏప్రిల్16(సూర్య రేఖ)** రామాయంపేట పట్టణంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు రామాయంపేట సెంటర్ ఆధ్వర్యంలో అంగన్వాడీ పోషణ పక్షం, బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ. మాది ప్రజల ప్రభుత్వమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఎదగాలని ఉద్దేశంతోనే ముందుకు వెళ్తుందన్నారు.మెదక్ నియోజకవర్గంలో తాము బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు.అంగన్వాడి టీచర్లు ఆయాలు చదువుకునే పిల్లలకు ఎలాంటి పౌష్టికాహారం లోపం లేకుండా వారికి అందించాలన్నారు.రామాయంపేట ప్రాంతంలో విద్యార్థుల కోసం 20 నుండి 25 ఎకరాల వరకు దాదాపు రూ.200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టమన్నారు.ఈ ప్రాంతంలో మన పిల్లలు చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలనే ఉద్దేశంతోనే తాము ఈ నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి హేమలత మాట్లాడుతూ. అంగన్వాడి సెంటర్లలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించే దిశగా అంగన్వాడీ టీచర్లు,ఆయాలు పనిచేస్తున్నారని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారంలో ఆకుకూరలు,పప్పు ధాన్యాలు, గుడ్లుతోపాటు పలు విధాల కూరగాయల భోజనంతో కూడినటువంటి సమతుల ఆహారాన్ని వారికి అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి మండల తహశీల్దార్ రజనీకుమారి,ఎంపీడీవో శాజీలోద్దీన్, మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ,జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి హేమలత,మండల సిడిపిఓ స్వరూప రాథోడ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాత రావు,సరాపు యాదగిరి, దేమే యాదగిరి,అల్లాడి వెంకటేష్,సుందర్ సింగ్,వినయ్ సాగర్, విద్యాసాగర్, నాగులు ఆయా గ్రామాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ తులసిరామ్ సేవలు మరువలేనివి





### జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు

**రాజేంద్రనగర్,ఏప్రిల్16(సూర్యరేఖ)** దివంగత,మాజీ పార్లమెంట్ సభ్యులు తులసిరామ్ సేవలు చిరస్మరణీయమని రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ-2025 అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం అన్నారు.బుధవారం మాజీ పార్లమెంట్ సభ్యులు వి.తులసిరామ్ 5వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మేరకు మహనీయుల జయంతి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రాజేంద్రనగర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో అన్ని దళిత సంఘాల నాయకులు ఆయనకు నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాజేంద్రనగర్ సర్కిల్లో మహనీయుల జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్వర్గీయ తులసిరామ్ మనవడు వర్రీ లలిత్ తులసిరామ్ పోయిల జీవన్ దాస్,పచ్చ శ్రీనివాస్ దాసరి రమేష్,మంగలారం శ్రీనివాస్,పత్యార నర్సింహ వేము వందనం,మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజుకుమార్,పంభాల రాజు,పోయిల మోహన్ రావు,ఇట్యాల వెంకటేష్,బలరామ్ సంజీవ,ఎడ్లకాడి చంద్ర శేఖర్,బర్ల సుమన్, కవ్వగూడెం జనార్దన్ ప్రసాద్,సంతోష్, చాంద్ నరేష్,బబ్లు,కోడూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ మార్నింగ్ మణికొండతో సమస్యల పరిష్కారం





**బీఆర్ఎస్ కు సమస్యలు తెలుపుతున్న ప్రజలు..**
**పరిష్కారానికి చొరవ చూపుతాం..**
**మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ**

**మణికొండ,ఏప్రిల్16(సూర్యరేఖ)** గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంతో మణికొండ మున్సిపాలిటీలో నెలకొన్న అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని బీఆర్ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ ఎజెండాగా పని చేస్తున్నట్లు వివరించారు.బుధవారం గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మేరకు లాలమ్మ గార్డెన్స్ పరిసర ప్రాంతాలలో సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అందులో భాగంగా పెంచిన ఆస్తి పన్ను విధానాన్ని ప్రతి ఒక్కరు విమర్శిస్తున్నట్లు తెలిపారు.ఈ మధ్య కాలంలో ప్రజలకు నేరుగా కానీ,వార్త పత్రికల ద్వారా కాని తెలియపరుచకుండా కనీసం కౌన్సిలర్ల ద్వారా కౌన్సిల్లో చర్చ చేయకుండా ఇంటి పన్ను పెంచడం దారుణమని,ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారన్నారు. పైగా సరియైన సమాచారం ఇవ్వకపోగా ఏ ఆధారము పరిగణలోకి తీసుకొని కొంత మందికి ఆస్తి పన్ను పెంచి మరి కొంత మందికి అసలు పెంచకపోవడం ఏంటని ప్రశ్నించారు. వివరణ అడిగితే మున్సిపాలిటి అధికారుల నుంచి అసలు స్పందనే లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్ల నిర్మాణం చేపట్టినప్పుడు డ్రైనేజీ వ్యవస్థ ఇంజనీర్ అజమాయిషీలో జరగాలని, అందుకు భిన్నంగా కేవలం కాంట్రాక్టర్ల బాగు కోసం వేసినట్టు,వారికి లబ్ధి చేకూరే విధముగా అజమాయిషీ లేకుండా డ్రైనేజీ వ్యవస్థ పైపులైన్ కొత్తగా వేయడం జరిగిందని,సరియైన పద్ధతి ప్రకారం వేయలేదని భిన్న రీతిలో ఏర్పరచిన కారణంగా రోడ్డు నంబర్ 4 లోని ఇందు ఆర్కేడ్ అపార్ట్మెంట్ కూడలి వద్ద చిన్న పాటి వర్షానికే వరద నీరు ఇండ్లలోకి వస్తున్నాయని తద్వారా లిఫ్ట్ గుంతలలోకి కూడా నీరు చేరి నివాసితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.మంచి నీటి సరఫరా ఒక సమయానికి పద్ధతి ప్రకారం విడుదల చేయడం లేదని, తీవ్రంగా నీటి ఎద్దడి ఉందనీ, వీరికి హైదరాబాద్ వాటర్ వర్క్స్ వారి ట్యాంకర్స్ సదుపాయం కూడా సరిగ్గా లేదన్నారు. ఈ కారణంగా ప్రైవేట్ ట్యాంకర్ల మీద ఆధారపడుతున్నామని తెలిపారు. చిన్నపాటి ఇరుకు సందుల్లోనీ ఇండ్లకు తగులుతూ 11 కేవి విద్యుత్ వైర్లు వెళ్ళడం వలన ప్రమాదాలు జరుగక ముందే ప్రత్యామ్నాయంగా బంచ్ కేబుల్ వేసి ప్రజలకు మేలు చేయాలని వేళా పాలా లేకుండా కరెంట్ కట్టింగ్లతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.వీధి కుక్కలతో పిల్లలు పెద్దలు భయ భ్రాంతులకు గురౌతున్నారని కావున వాటికి స్టెరిలైజేషన్ వాక్సినేషన్ చేయడం వలన కొంత మేర ఉపశమనం కలుగుతుందని తెలిపారు. వీధిలో వ్యర్థ పదార్థాలను సమయానికి తీసుకెళ్ళకపోవడంతో గుట్టల్లా చెత్త పేరుకుపోయి దోమలతో పిల్లలు,పెద్దలు అనారోగ్యాలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు వివరించారు. ప్రతి సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్,అందే లక్ష్మణ్ రావు,బుద్ధోలు బాబు సంఘం శ్రీకాంత్ శ్రీనివాస్ చారి,యాలాల కిరణ్ భాను చందర్ సుమనళిని,బొడ్డు శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ కాంగ్రెస్ నేత రొయ్యల పోచయ్య మృతి



**రామాయంపేట,ఏప్రిల్16(సూర్యరేఖ)** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి నాలుగు దశాబ్దాలకు పైగా విశేషంగా సేవలందించిన సీనియర్ నాయకుడు రొయ్యల పోచయ్య మరణించారు.పార్టీకి సైనికునిగా,కార్యకర్తగా నిరంతరం అంకితభావంతో సేవలందించిన ఆయన మృతి పట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.పార్టీకి ఆయన అందించిన ఈ త్యాగస్వభావ సేవల్ని మర్చిపోలేమని,వారి మరణం పార్టీకి తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు.రొయ్యల పోచయ్య ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు.

### నేడు ఈడి కార్యాలయం ఎదుట నిరసన ధర్నాకు తరలిరండి

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్,ఏప్రిల్16(సూర్యరేఖ):** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఈడీ కార్యాలయం ముందు నిరసన,ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బంధముల పరమేశ్వర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ రాజకీయ కక్ష సాధింపు ధోరణిని నిరసిస్తూ గురువారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఈడి కార్యాలయం ముందు టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా జరగనుందన్నారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్షపూరితంగా ఏఐసిసి అగ్ర నేతలు సోనియా గాంధీ,రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్లో చేర్చడాన్ని నిరసిస్తూ టిపిసిసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఉప్పల్ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు,అనుబంధ సంస్థల అధ్యక్షులు యువజన విభాగం,మహిళా విభాగం ఎన్ఎస్ యుఐ,అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 27న చలో వరంగల్ రజతోత్సవ సభకు తరలిరావాలి..

**సులేమాన్ నగర్ డివిజన్ పార్టీ సమావేశంలో పటోళ్ల కార్తీక్ రెడ్డి**





**రాజేంద్రనగర్,ఏప్రిల్16(సూర్యరేఖ)** బీఆర్ ఎస్ పార్టీ విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషించదగ్గ విషయమని రాజేంద్ర నగర్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్ నగర్,శాస్త్రిపురం డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం సులేమాన్ నగర్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పటోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ పట్ల సానుకూలత పెరుగుతుందన్నారు. కాంగ్రెస్,బీజేపీలు ప్రజలను తీవ్రంగా మోసగిస్తున్నాయని ఆరోపించారు. ఈ నెల 27 వ తేదీన ఏప్రిల్ వరంగల్లో తలపెట్టిన ప్లీనరీ సమావేశానికి డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రావాలని సూచించారు.పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ సభకు తరలిరావాలన్నారు.ముస్లిం సోదరులు ప్రధానంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.గతంలో ఏ ప్రభుత్వం ముస్లింలను ఆర్థికంగా ఆదుకున్న దాఖలాలు లేవని,మలి విడత తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కేసీఆర్ సీఎం అయ్యాకే రాష్ట్ర అభివృద్ధి కోసం,పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికార వ్యామోహంతో ఎన్నో హామీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల పూర్తి అసహనంతో ఉన్నారని..ప్రజలందరూ కూడా మళ్ళీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ జహీరుద్దీన్ ఎండీ ముక్రమ్ ఖాన్,అబ్దుల్ రెహమాన్,అహ్మద్ పటేల్,అదిరాల రవి ఎండీ అలీ,అసిఫ్,సైద్అమీర్,మాకబూల్ షాజది, సోహైల్, షరీఫ్ ఇమ్రాన్ పటేల్,అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి





**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి**

**ప్రజలకు సమార్ధవంతమైన సేవలు అందిచాలి**

**మెదక్,ఎప్రిల్16(సూర్య రేఖ)** గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు.నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని ఫోక్సో,గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు.ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని,కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించాలని అన్నారు.ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని తెలియజేశారు.విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అదే విదంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్ ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.జిల్లా పోలీసు అధికారులకు సిసి కెమెరాల పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.రద్దీ గల ప్రదేశాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.దీని వలన నేరలను చేధించడంలో సిసి కెమెరాలు ఉపయోగపడుతాయని,గతంలో చాలా కేసులు సిసి కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించడం జరిగిందని అన్నారు.కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవిలు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన సత్వర సేవలు అందించాన్నారు.సైబర్ క్రైమ్ డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి,మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్,సైబర్ క్రైమ్ డిఎస్పీ సుభాష్ చంద్ర బోస్,ఎఆర్ డిఎస్పీ రంగా నాయక్,మెదక్ టౌన్ సిఐ నాగరాజు,మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి,అల్లాదుర్గ్ సిఐ రేణుక రెడ్డి,తూప్రాన్ సిఐ రంగా కృష్ణ,ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్,ఎస్సైలు పాల్గొన్నారు.

# హనుమంతుడి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి





**ఆలయ భూమి పూజలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్**

**రాజేంద్రనగర్,ఏప్రిల్16(సూర్యరేఖ)**ఆ హనుమంతుడి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ ఆకాంక్షించారు. బుధవారం రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్ పల్లి న్యూ ఫ్రెండ్స్ కాలనీ అసోసియేషన్ లో శ్రీ వీరాంనేయస్వామి స్వయంభు దేవస్థానంలో హనుమాన్ మందిర భూమి పూజలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆలయ నిర్మాణానికి అన్ని విధాలా తాను సహకరిస్తానని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.హనుమాన్ మందిర భూమి పూజలో రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి,పలుకు చెరువు మహేష్,గ్రామ పెద్దలు, దేవాలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ తుక్కప్ప జన్మదిన వేడుకలు







**పాల్గొన్న నల్లంపల్లి ఉపాధి హామీ కూలీలు**

**అందోల్,ఏప్రిల్16(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండలం నల్లంపల్లి టెక్నీకల్ అసిస్టెంట్ తుకప్ప జన్మదిన వేడుకలు నల్లంపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.తుక్కప్ప సారు నల్లంపల్లి గ్రామానికి చేసిన సేవలు మరువలేనివీ అని ఆయనకు ఆ దేవుడు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో చల్లగా చూడాలని నల్లంపల్లి ఉపాధి హామీ పనిచేసే కూలీలు ప్రజలు ఆ దేవుని వేడుకోవడం జరిగింది.అలాగే స్వీట్లు తినిపించి శాలువాతో ఘనంగా సన్మానించారు. నల్లంపల్లి ఉపాధి కూలీలకు తుక్కా ప్రసాద్ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజల కోసమే పోలీసులు

**సీసీ కెమెరాలపై అవగాహనలో సీఐ అఫ్జలుద్దీన్**



**బెల్లంపల్లి,ఏప్రిల్16(సూర్య రేఖ)** ప్రజల కోసమే పోలీసులు పని చేస్తున్నారని ఇన్‌స్పెక్టర్ అఫ్జలుద్దీన్ అన్నారు.బెల్లంపల్లి పట్టణం కాల్టెక్స్ ఏరియాలో టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల వినియోగం రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ పాల్గొని మాట్లాడారు.ఇళ్లు,వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆదేశించారు.ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారని ప్రజల శ్రేయస్సు కోరకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,ఒక్క సీసీ కెమెరా 100 పోలీసులతో సమానమని,కెమెరాలు పెట్టుకొని,అందరూ పోలీసులతో సహకరించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్సై మహేందర్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గాలిగుంట టీకాలు...



**శివంపేట,ఏప్రిల్16(సూర్య రేఖ)** ఉచిత గాలి కుంట నివారణ టీకాల క్యాంపును శివంపేట మండలంలోని శివంపేట,చెన్నపూర్ గ్రామంలో క్యాంపు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ వైద్యాధికారి డాక్టర్ పెంటయ్య,డాక్టర్ సంధ్యారాణి,డాక్టర్ గోపాల్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.ఈ అవకాశాన్ని రైతులు గురువారం నుంచి సద్వినియోగించుకోవాలని సూచించారు.

## దళిత రత్న అవార్డు అందుకున్న మాల మహానాడు ప్రచార కార్యదర్శి..

**ఆకుల పెంటయ్య**




**కొల్చారం,ఏప్రిల్ 16 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు,మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య ఏప్రిల్ 14 హైదరాబాదు రవీంద్ర భారతిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాల సందర్భంగా కమిటీ కన్వీనర్ ఇటుక రాజుమాదిగ,కో కన్వీనర్ చెరుకు రామ్ చందర్,ల చేతుల మీదుగా జాతీయ దళిత రత్న అవార్డు అందుకోవడం జరిగిందని రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య తెలిపారు.ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ...వారి చేతిలో మీదుగా దళిత రత్న అవార్డు అందుకోవాలని చాలా సంతోషంగా ఉందని,మారుమూల గ్రామం వరిగుంతం గ్రామానికి కొల్చారం మండలానికి దళిత అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్క మాల మహానాడు మండలాల అధ్యక్షుల అధ్యక్షులకు గర్వకరమన్నారు.ఈ సందర్భంగా కొల్చారం మండలం మాల మహానాడు అధ్యక్షుడు ఎర్ర పురుషోత్తం మాట్లాడుతూ...దళిత రత్న అవార్డు అందుకున్న ఆకుల పెంటయ్యకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా భూభారతి పైలెట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం






**= రైతుల కష్టాలను పరిష్కరించేందుకే భూ భారతి**

**పరిగి,ఏప్రిల్16(సూర్య రేఖ)** తెలంగాణలో భూ భారతి చట్టం ఏప్రిల్ 17 నుంచి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అమల్లోకి రానుందని,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ చట్టాన్ని ప్రారంభించనున్నారని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి అన్నారు.వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం పరిగి నియోజకవర్గానికి పర్యవేక్షణ నిమిత్తం రావడం గురువారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిగి నియోజకవర్గానికి విచ్చేయనున్న నేపథ్యంలో ఆయన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇది భూ సమస్యలను పరిష్కరించేందుకు కీలకం కానుందని తెలంగాణలో పలు రకాల భూ సమస్యలు ఇంకా వున్నాయని అన్నారు.ఈ క్రమంలో రానున్న రోజుల్లో అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించనుందని తెలిపారు.గత ప్రభుత్వం ధరణి పేరు మీద ప్రజలను ఎంతో మోసం చేసిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం ధరణిని రద్దుచేసి భూ భారతిని తీసుకొచ్చారని తెలిపారు.అదేవిధంగా పరిగి నియోజకవర్గానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రావడం జరుగుతుందని,మధ్యాహ్నం 12 గంటలకు పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అదనపు సౌకర్యాల కల్పన ప్రారంభోత్సవం కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు.అనంతరం పూడూరు మండల కేంద్రంలో భూభారతి పోర్టల్‌లో అవగాహన సదస్సు కార్యక్రమంలో సైతం పాల్గొంటారని తెలిపారు.అదే విధంగా జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తో కలిసి పరిగి నియోజకవర్గంలో ఎంపీడీవో కార్యాలయంలో ఇంది రమ్మ మోడల్ హౌస్ పర్యవేక్షణ,సుల్తాన్ పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ కార్యక్రమం చేశారని, అనంతరం పూడూరు మండలం ఎంకేపల్లి గ్రామానికి చెందిన మాల లక్ష్మికి, ఇందిరమ్మ ఇల్లుకు సంబంధించి మొదట విడతగా రూ.లక్ష రూపాయల చెక్కును అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మెన్ పరుశు రామ్ రెడ్డి,పరిగి పట్టణ కాంగ్రెస్,మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో ఘోరం..విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో పిల్లలపై విషప్రయోగం.!

**30 మంది పిల్లలకు తప్పిన ముప్పు..**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,ఏప్రిల్ 16(సూర్యరేఖ)** ఆదిలాబాద్ ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లలపై గుర్తు తెలియని దండుగులు విష ప్రయోగయత్నానికి పాల్పడ్డారు.విద్యార్థులు తాగే నీటి ట్యాంక్‌లో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందులు చల్లారు.బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.పాఠశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో పాఠశాలలోని వంట గదికి సిబ్బంది తాళాలు వేసుకుని వెళ్లారు.సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన సిబ్బంది వంట చేసేందుకు పాత్రలు కడిగే సమయంలో దుర్వాసన,నురగలు వచ్చాయి.దీంతో అప్రమత్తమైన పాఠశాల హెడ్ మాస్టర్,సిబ్బంది చుట్టుపక్కల చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది.అలాగే తాగు నీటి ట్యాంక్‌లోనూ పురుగుల మందు కలిపినట్లుగా సిబ్బంది గుర్తించారు.దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది..విద్యార్థులను తాగునీటి




కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు.మధ్యాహ్న భోజనం వండలేదు. ఈ ఘటనపై ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సరైన సమయానికి పాఠశాల సిబ్బంది గుర్తించి మధ్యాహ్న భోజనం వండకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.ధర్మపురి పాఠశాలలో దాదాపు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు.వీరంతా విష ప్రయోగం నుంచి బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా,ఈ ఘటనపై పాఠశాల సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు మండిపడుతున్నారు. అసలు స్కూల్ పిల్లలపై విష ప్రయోగం చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని.. చిన్న పిల్లలు ఏం పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గులాబీ పండుగకు తరలివచ్చి..కాంగ్రెస్ గుండెలదిరేలా చేద్దాం

**మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు..**

**బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి..**

**కేసీఆర్‌ది నిర్మాణాత్మక పాలన..రేవంత్‌ది దుర్మార్గ పాలన**

**మాజీ కౌన్సిలర్,మైలార్ దేవులపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కురుమ**



**రాజేంద్రనగర,ఏప్రిల్16(సూర్యరేఖ)** వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ కౌన్సిలర్, మైలార్ దేవులపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కురుమ పిలుపునిచ్చారు. డివిజన్ పరిధి బాబుల్ రెడ్డినగర్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు తెలియజేస్తూ,కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ సభకు జనాలను తరలించాలన్నారు. కేసీఆర్ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు.సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రజల పైన పన్నుల భారం మోపుతున్నారన్నారు.హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి ప్రజలు అసహించుకుంటున్నారని అన్నారు.కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత రేవంత్‌కే దక్కుతుందన్నారు.4 కోట్ల ప్రజలున్న తెలంగాణలో నిర్వహిస్తున్న ఈ సభ చరిత్రాత్మకంగా నిలుస్తుందని,ఇలాంటి సభలు కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమని ఎస్.వెంకటేష్ కురుమ పేర్కొన్నారు. పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని,ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు.ప్రస్తుతం అందరూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటే బాగుండునని అనుకుంటున్నారని తెలిపారు.డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.రజతోత్సవ సభకు ప్రజలు వెళ్లకుండా పోలీసులు అనేక ఆంక్షలు పెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## సైదాపూర్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**హుస్నాబాద్ :** అనంతర విశాల సహకార పరపతి సంఘం లి. సైదాపూర్ మండలం ఆధ్వర్యంలో సైదాపూర్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, విశాల సహకార పరపతి సంఘం మండల అధ్యక్షుడు కొత్త తిరుపతి రెడ్డి, ఆర్డీవో రమేష్ , ఇతర అధికారులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. ఒకటో తేదీ పోతారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. ఎక్కడైనా అవసరముంటే అదనంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇస్తున్నాం. గత పంట కు సంబంధించిన సన్న వడ్లకు బోనస్ పెండింగ్ బిల్లులు లేవు ఎవరికైనా పేమెంట్ కాకపోతే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురండి ఇప్పుడు కూడా సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నాం. ఎవరు బయట అమ్ముకోవద్దు అవే వడ్లు సన్న బియ్యం రూపంలో మనకు వస్తున్నాయి. దేశంలోనే మొదటిసారి తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ అందిస్తున్నాం రైతులకు రుణమాఫీ పూర్తి చేశాం. 168 కళ్యాణ లక్ష్మి చెక్కులు ఈ మండలానికి వచ్చాయి గురుకుల పిల్లలకు మెస్ చార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచడం జరిగింది. ధాన్యం కొనుగోలు లో ఎక్కడ అదనపు తూకం ఉండదు రైతులకు ఏ కష్టం రాకుండా చర్యలు తీసుకుంటున్నాం సన్న బియ్యం పంపిణీ అద్భుతంగా జరిగింది. మా పైసలతో అంటున్న కేంద్ర ప్రభుత్వం మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు ఇవ్వడం లేదు సన్న బియ్యం మీ ఇళ్లలోకి వచ్చి భోజనం చేస్తా. నీళ్ల కొరత ఉంటే చెప్పండి ధరణి స్థానంలో భూ భారతి చట్టం తెచ్చాం రెవెన్యూ పరమైన భూపంచాయతీ ఉండద్దు భూమి అంటే ఆత్మగౌరవం అలాంటి పంచాయతీ లు ఇక ఉండదు ఎస్సీ వర్గీకరణ పై చారిత్రక నిర్ణయం తీసుకున్నాం దేశంలోనే మొదటిసారి చట్టం తెచ్చాం. బీసీ కుల గణన చేశాం రిజర్వేషన్ల పెంపు చట్టం తెచ్చాం. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది ఇందులో రాజకీయ జోక్యం ఉండదు ఇళు లేని పేదలకు ఇళ్లు మొదటి దశలో 3500 నియోజకవర్గంలో ఉంటుంది.

## రేవంత్ సర్కారును పడగొట్టేటందుకు సుపారి.?

**హైదరాబాద్ :** తెలంగాణ పాలిటిక్స్ లో కొత్త దుమారం హాట్ టాపిక్ గా దుబ్బాక ఎమ్మెల్యే వ్యాఖ్యలు కొత్త కామెంట్స్ పై మంత్రుల ఆగ్రహం ఆ మాటల వెనుక కేసీఆర్ ఉన్నారని విమర్శలు, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పారిశ్రామిక వేత్తలు డబ్బులు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారంటూ దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్?గా మారాయి. ప్రజాస్వామ్య బద్ధంగా ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంపైనా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు డబ్బుల అంశాన్ని ఎవరూ ప్రస్తావించలేదు. అయితే కొత్త ప్రభాకర్ రెడ్డి మాత్రం వ్యాపారులు డబ్బులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే కుట్ర జరుగుతోందా? అన్న చర్చ మొదలైంది.

అప్పుడు జాతర ఇప్పుడు పాతర,

ఫిరాయింపులను ప్రోత్సహించటంలో కేసీఆర్?కు ఘన చరిత్రే ఉంది. పదేండ్లు అధికారంలో ఉన్నపుడు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు, నలుగురు ఎంపీలను ప్రలోభాలకు గురిచేసి ఒత్తిడి పెట్టి ఏదో ఒక రూపంలో బీఆర్ఎస్?లోకి లాక్కున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. తాము అధికారంలో ఉన్నపుడు ఎలాంటి పనులుచేసినా చట్టబద్దమే, అంతా న్యాయబద్దంగా చేసినట్లేనని, అదేపనిని తాము ప్రతిపక్షంలో ఉన్నపుడు అధికార పార్టీ చేస్తే రాజ్యాంగవిరుద్ధం, చట్టవ్యతిరేకం, ప్రజాస్వామ్యానికి పాతర అనే విషయాలు గుర్తుకొస్తాయనే విమర్శలున్నాయి. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారిన విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తమ పార్టీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేరినప్పుడు జాతర చేసుకున్న గులాబీ నేతలు.. ఇప్పుడు ప్రజాస్వామ్యానికి పాతరంటూ గగ్గోలు పెడుతుండటం గమనార్హం.

**ఎమ్మెల్యేలను కొంటరా:**

కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యల వెనుక కేసీఆర్ ఉన్నారన్న ఆరోపణలు కాంగ్రెస్ వైపు నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి ఉన్న ఎమ్మెల్యేల బలం కేవలం 28 మాత్రమే. అధికారంలోకి రావాలంటే ఇంకా 33 మంది ఎమ్మెల్యేలు కావాలి. ప్రభుత్వాన్ని పడగొట్టడం కాదు కాదా.. కనీసం అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సరిపోయేంత బలం కూడా లేదనేది నిష్టుర సత్యం. కానీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాత్రం ఈ వ్యాఖ్యల వెనుక కేసీఆర్ ఉన్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొట్టమొదటి సారి డబ్బుల అంశం తెరపైకి రావడం కొత్త దుమారంగా మారింది.

## అఘోరీ శ్రీనివాస్‌పై సంచలన ఆరోపణలు.

**తనను పెళ్లి చేసుకున్నాడంటూ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు.**

**హైదరాబాద్** తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన అఘోరీ శ్రీనివాస్‌పై తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు అందింది. హైదరాబాద్ రాణిగంజ్ బుద్ధ భవన్‌లో ఉన్న మహిళా కమిషన్ కార్యాలయానికి వెళ్లిన కరీంనగర్‌కు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అఘోరి శ్రీనివాస్ తనను పెళ్లి పేరుతో వాడుకుని వదిలేశాడంటూ కమిషన్ ఎదుట భాదితురాలు వాపోయింది. తన జీవితాన్ని నాశనం చేశాడని, వర్షిణి అనే మరో యువతిని వివాహం చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అమాయక మహిళల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అఘోరీపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. పెళ్లైన విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని అఘోరీ బెదిరిస్తున్నాడని వాపోయింది. తనలాంటి మహిళలు చాలా మందిని అతను మోసం చేశాడని, అందరూ ధైర్యంగా బయటకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమె కోరింది. తన వద్ద డబ్బులు తీసుకుని మానసికంగా హింసించాడని చెప్పింది. నగ్నపూజలు చేయిస్తానని చెప్పి నగదు తీసుకుని మోసం చేశాడని బాధితురాలు చెబుతోంది. కాగా, రూ.9.08 లక్షలు తీసుకుని మోసం చేశాడంటూ సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ మోకిలా పోలీసులు కేసు నమోదు చేశారు. 308, 301, 351, 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు పెట్టారు. మరోవైపు వర్షిణి తల్లిదండ్రులు, అన్నలు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వర్షిణినీ అఘోరి శ్రీనివాస్ నమ్మించి మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఆరోపించారు. అతని చెర నుంచి తమ కుమార్తెను ఎలాగైనా కాపాడి అప్పగించాలని బాధితులు కోరారు. కాగా, ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో అఘోరీ శ్రీనివాస్ ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా అతని ఆగడాలను అరికట్టాలని పలువురు తెలుగు రాష్ట్రాల ప్రజలు రెండు ప్రభుత్వాలను కోరుతున్నారు.

## తెలంగాణ భూభారతి పోర్టల్ ద్వారా ల్యాండ్ రికార్డ్స్ ఎలా చెక్ చేయాలో తెలుసుకుందాం

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన భూభారతి పోర్టల్ ల్యాండ్ రికార్డ్స్ వ్యవస్థలో ఒక విప్లవాత్మకమైన మార్పు తెచ్చేందుకు సిద్ధమైంది. ఈ పోర్టల్ ను సీఎం రేవంత్ రెడ్డి ఏప్రిల్ 14వ తేదీ శిల్పకళా వేదికలో అధికారికంగా ప్రారంభించారు. ఫీచర్స్ ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం: భూమి రికార్డుల డిజిటలైజేషన్ భూభారతి పోర్టల్ ద్వారా సులభతరం అవుతుంది ముఖ్యంగా భూమికి సంబంధించిన రికార్డులన్నింటినీ డిజిటల్ రూపంలో భూ యజమానుల వివరాలను సైతం తెలుసుకునే అవకాశం ఈ పోర్టల్ ద్వారా కలుగుతుంది.జిపిఎస్ ఆధారిత సర్వే నిర్వహించడం ద్వారా భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించే అవకాశం కలుగుతుంది. తద్వారా భూముల వివాదాలను తగ్గించే వీలు ఉంటుంది.భూధార్ నెంబర్ నెంబర్ ద్వారా భూమిలో వివరాలను సులభంగా గుర్తించే అవకాశం లభిస్తుంది.ఇకపై భూముల రిజిస్ట్రేషన్ లో మ్యుటేషన్లు, అప్పీల్స్, సమీక్షలు, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడము, నాలా రిజిస్ట్రేషన్ వాటి సేవలన్నింటికీ ఇది ఒకే ప్లాట్ ఫారంగా పని చేయనుంది. తద్వారా పలు రకాల భూ సంబంధిత సేవలు సులభతరం కానున్నాయి. భూమి సంబంధిత వివాదాల వాటి పరిష్కారాలు న్యాయస్థానాలకు వెళ్లకుండానే రెవెన్యూ శాఖ ద్వారా పరిష్కరించేందుకు అప్పీల్స్ వ్యవస్థను కూడా ఇందులో ఏర్పాటు చేయనున్నారు. తద్వారా భూమి వివాదాలు పరిష్కారం అవుతాయి.ప్రస్తుతం భూభారతి పోర్టల్ సేవలు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

# బిజినెస్

## ఇకపై కదిలే రైళ్లలోనూ ఏటీఎం సేవలు!



ఇండియన్ రైల్వే సరికొత్త ప్రయోగం చేపట్టింది. ఇకపై కదిలే రైళ్లల్లో కూడా ఎటిఎం సర్వీసును సెంట్రల్ రైల్వే ప్రయాణీకులకు అందుబాటు లోకి తెచ్చింది. ఇప్పటికే పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఎటిఎం సర్వీసును ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్‌ను అధికారులు పరిశీలించారు. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశ వ్యాప్తంగా అన్ని రైళ్లలో ఎటిఎం సర్వీసులు రానున్నాయి. రైల్వే అధికారులు మాట్లాడుతూ %% మొదటిసారిగా ముంబయిమన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఏటీఎంను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ నడిచే ఈ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రైవేట్ బ్యాంకుకు చెందిన ఎటీఎంను ఏసీ ఛైర్‌కార్ కోచ్‌లో ఏర్పాటు చేశామన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో ఈ సదుపాయాన్ని ప్రయాణీకులందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా దీన్ని ఏర్పాటు చేశామని, సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా తెలిపారు. కోచ్‌లో గతంలో తాత్కాలిక ప్యాంట్రీగా వినియోగించిన స్థలంలోనే ఏటీఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రైలు ముందుకు వెళేటప్పుడు భద్రతా పరంగా ఇబ్బందులు లేకుండా షట్టర్ డోర్ అమర్చారనీ, దీనికి సంబంధించిన కోచ్‌లో కూడా అవసరమైన మార్పులు మన్మాడ్ వర్క్‌షాప్‌లో చేశామని స్పష్టం చేశారు. అయితే ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినల్ నుంచి మన్మాడ్ జంక్షన్ వరకు ప్రతిరోజూ పంచవటి ఎక్స్‌ప్రెస్ వెళుతుంది. దాదాపు 4 గంటల 30 నిముషాల్లో గమ్యస్థానానికి చేరుకునే ఈ రైలు ఆ మార్గంలో కీలకంగా ఉంది. అందుకే ముందుగా ఈ రైల్లో ప్రయోగాత్మకంగా ఏటీఎం సేవలను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే మిగతా మార్గాల్లో కూడా రైళ్లలో ఏటీఎం సేవలు అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కాగ్నిజెంట్‌తో సిటిజన్స్ ఫైనాన్సియల్ భాగస్వామ్యం



అమెరికా కేంద్రంగా పని చేస్తోన్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సిటిజన్స్ ఫైనాన్సియల్ గ్రూప్ తమ ఆవిష్కరణల వేగవంగానికి కాగ్నిజెంట్‌లో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆ సంస్థ ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ వ్యూహాన్ని అమలు చేయడానికి వీలుగా హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. దీనిని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంబించారు. ఇది భారత్‌లోనే తన మొట్టమొదటి జీసీసీ అని సిటిజన్స్ ఫైనాన్సియల్ వెల్లడించింది. దీని ద్వారా 1,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కాగ్నిజెంట్ కొత్త జీసీసీ సెంటర్ ద్వారా ఎంటర్‌ప్రైజ్ టెక్ సామర్థ్యాలు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ప్లాట్‌ఫామ్‌లు, డేటా అనలైజ్, ఉత్పత్తి ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. నిజానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా పనిచేస్తుందన్నారు. సిటిజన్స్ బ్యాంక్, కాగ్నిజెంట్ చేతులు కలపడంతో, భారతదేశ జీడీపీకి 1 ట్రిలియన్ డాలర్లు అందించే మొదటి రాష్ట్రంగా అవతరించే లక్ష్యానికి తెలంగాణ దగ్గరగా ఉందని మంత్రి అన్నారు.

# వ్యాగన్ ఆర్ నయా ఎడిషన్.. ప్రత్యేకతలు తెలిస్తే షాక్



భారతదేశంలోని ప్రజలకు సొంత కారు అనేది ఓ ఎమోషన్. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు కారు కొనుగోలు చేయాలని ఆశపడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రముఖ కంపెనీ మారుతీ సుజుకీ బడ్జెట్ ఫ్రెండ్లీ కార్లను రిలీజ్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా మారుతీ సుజుకీ అంటే మధ్యతరగతి ప్రజలకు ప్రత్యేక అభిమానం. అయితే ఇటీవల బడ్జెట్ ఫ్రెండ్లీ కారు అయిన మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్‌ను ఆ కంపెనీ అప్‌డేట్ చేసింది. మారుతి సుజుకి వ్యాగన్‌ఆర్ చాలా కాలంగా భారతీయ కార్ల కొనుగోలుదారులను ఆకర్షిస్తుంది. ముఖ్యంగా కొత్త అప్‌డేట్స్, స్థిరమైన అమ్మకాల పనితీరుతో ఈ కారు ఇతర బడ్జెట్ కార్లకు గట్టి పోటీనిస్తుంది. తాజా అప్‌డేట్‌లో మారుతి సుజుకి వ్యాగన్‌ఆర్ కారులో ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌ను సెట్ చేసి ప్రయాణికుల భద్రతకు కీలక చర్యలు తీసుకున్నారు. హార్టెక్ట్ ప్లాట్ ఫామ్, హై టెన్సైల్ స్టీల్ నిర్మాణంతో వచ్చే వ్యాగన్‌ఆర్ ఇప్పుడు క్రాష్ జరిగినప్పుడు మెరుగైన రక్షణను అందించేలా రూపొందించారు. వరుసగా నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా అంటే 2022, 2023, 2024, 2025 సంవత్సరాల్లో వ్యాగన్‌ఆర్ భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా నిలిచింది. తాజా ఆర్థిక సంవత్సరంలోనే 1,98,451 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇప్పటి వరకు 3.37 మిలియన్లకు పైగా యూనిట్లు అమ్ముడయ్యాయి. వ్యాగన్‌ఆర్ భారతీయ వినియోగదారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. వ్యాగన్ ఆర్ కారు ఇది 65 బీహెచ్‌పీ, 89 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేసే 1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 88 బీహెచ్‌పీ, 113 ఎన్ఎం అందించే 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 56 బీహెచ్‌పీ, 82 ఎన్ఎం ఉత్పత్తి చేసే సీఎన్‌జీ వేరియంట్‌లో అందుబాటులో ఉంది. పెట్రోల్ ఇంజిన్లను 5 స్పీడ్ మాన్యువల్ లేదా 5 స్పీడ్ ఏఎంటీ జత చేయవచ్చు. అయితే సీఎన్‌జీ వేరియంట్‌ను మాన్యువల్ గేర్బాక్స్ మాత్రమే అందిస్తారు. సీఎన్‌జీ పవర్ ట్రెయిన్ కొనుగోలుదారుల్లో అత్యంత ప్రజాదరణ పొందింది. వ్యాగన్‌ఆర్ రోజువారీ సౌలభ్యం, సౌకర్యాన్ని పెంచే లక్షణాల తో నిండి ఉంది. ఇది సౌకర్యవంతమైన నిల్వ కోసం 60:40 స్ప్లిట్ సీట్లు, స్టైలిష్ క్యాబిన్ అనుభూతి కోసం డ్యూయల్-టోన్ ఇంటీరియర్స్, డ్రైవింగ్ సౌలభ్యం కోసం టిల్ట్ స్టీరింగ్, డ్రైవర్‌కు సమాచారం అందించడానికి మల్టీ-ఇన్ఫర్మే షన్ డిస్ప్లేను అందిస్తుంది. ఇతర ఉపయోగకరమైన చేర్పుల్లో వెనుక పార్శిల్ ట్రే, హీటర్తో ఎయిర్ కండిషనింగ్, ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లేకు మద్దతు ఇచ్చే 17.78 సెం.మీ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ ఉన్నాయి. 25 సంవత్సరాల క్రితం ప్రవేశ పెట్టిన వ్యాగన్‌ఆర్, టాటా ఇండికా, దేవూ మాటిజ్, హ్యుందాయ్ శాంట్రో వంటి చాలా కార్ల ఉత్పత్తిని నిలిపేశారు.

# ఎగిసిన వాణిజ్య లోటు మార్చిలో 21.5 బిలియన్లకు చేరిక



ప్రపంచ మార్కెట్‌లో భారత ఎగుమతులు డీలా పడటంతో మరోవైపు దిగుమతులు పెరగడంతో దేశ వాణిజ్య లోటు రికార్డ్ స్థాయిలో పెరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వాణిజ్యలోటు 14.05 బిలియన్ డాలర్లతో మూడు ఏళ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదు కాగా.. తిరిగి మార్చిలో ఏకంగా 21.54 బిలియన్లకు ఎగిసింది. ఒక్క సారిగా దిగుమతులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గడిచిన మార్చిలో భారత సరుకుల దిగుమతులు 11.3 శాతం పెరిగి 64.51 బిలియన్ డాలర్లకు పెరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇవి ఫిబ్రవరిలో 50.96 బిలియన్లుగా నమోదయ్యాయి. 2025 మార్చిలో సరుకుల ఎగుమతులు మాత్రం 0.7 శాతం పెరిగి 41.97 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో స్థూల భారత ఎగుమతులు స్వల్పంగా 0.08 శాతం పెరిగి 437.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మరోవైపు దిగుమతులు 6.62 శాతం పెరిగి రూ.720.24 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. ”గతేడాది సరుకుల ఎగుమతు ల్లో పెరుగుదలను సాధించాము. ముఖ్యంగా పెట్రోలియం యేతర ఎగుమతులు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ఈ రంగం ఏకంగా 6 శాతం వృద్ధిని కనబర్చింది.” అని వాణిజ్య మంత్రి త్వ శాఖ తెలిపింది. 2024-25లో బంగారం దిగుమతులు 58.01 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇంతక్రితం ఏడాది 45.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

# ఐపిఎల్‌లో కనిపించని జోష్

# స్పోర్ట్స్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. ప్రపంచంలోనే అత్యంత జనాదారణ కలిగిన క్రికెట్ లీగ్‌గా ఐపిఎల్ పేరు తెచ్చుకుంది. క్రికెట్‌లో ఎన్నో లీగ్‌లు ఉన్నా ఐపిఎల్‌కు ఉన్నా క్రేజ్ మరే లీగ్‌కు లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఏడాది జరిగే ఈ టోర్నమెంట్‌ను చూసేందుకు అభిమానులు ఎంతో ఆసక్తి చూపుతారు. దేశంలోని ప్రముఖ నగరాల్లో దాదాపు రెండు నెలల పాటు ఐపిఎల్ మ్యాచ్‌లు సందడి చేస్తాయి. హైదరాబాద్, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ వంటి నగరాల్లో జరిగే మ్యాచ్‌లకు ఉండే ఆదరణ మాటల్లో వర్ణించలేము. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగే ఐపిఎల్ మ్యాచ్‌కు అభిమానులు బ్రహ్మరథం పట్టడం అనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఉప్పల్ వేదికగా 9 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ సీజన్‌లో హైదరాబాద్‌లో ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. అయితే ఈసారి పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచింది. నాలుగు మ్యాచుల్లో సన్‌రైజర్స్ రెండింటిలో పరాజయం చవిచూసింది. ఇక హైదరాబాద్ వేదికగా సాగిన మ్యాచ్‌లపై అభిమానులు పెద్దగా ఆసక్తి చూపించడం లేదనే చెప్పాలి. గతంలో ఉన్న జోష్ ఈసారి కనిపించడం లేదు. మ్యాచ్‌లను చూసేందుకు అభిమానులు స్టేడియానికి భారీగానే తరలివస్తున్నా ఒకప్పటి సందడి వాతావరణం మాత్రం లేదనే చెప్పాలి. సిక్సర్లు, ఫోర్లు కొట్టినా అభిమానుల నుంచి పెద్దగా స్పందన లభించడం లేదు. ఒకప్పుడూ అభిమానులు చేసే కేరింతలు, నృత్యాలు, కేకలతో మైదానంలో పండుగ వాతావరణం కనిపించేది. కానీ ఈసారి మైదానాల్లో హల్‌చల్ ఉండడం లేదు. దాదాపు ప్రతి మ్యాచ్ చప్పగా సాగిపోతోంది. కిందటి సీజన్‌లో హైదరాబాద్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి తదతితరులు విధ్వంసక బ్యాటింగ్‌తో అభిమానులను కనువిందు చేశారు. కానీ ఈసారి వారి బ్యాటింగ్‌లో అప్పటి జోష్ లేదు. ఇది కూడా క్రికెట్ ప్రేమికులను నిరాశకు గురి చేసిన అంశంగా చెప్పలేదు. పంజాబ్‌తో జరిగిన కిందటి మ్యాచ్‌లో తప్పిస్తే హైదరాబాద్ బ్యాటర్లు తమ మార్క్ బ్యాటింగ్‌తో అలరించలేదు. పంజాబ్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ పూర్వవైభవాన్ని సంతిరించుకోవడంతో రానున్న మ్యాచుల్లోనైనా అభిమానుల్లో కొత్త జోష్ నెలకొనే ఛాన్స్ ఉంది.

## ఒలింపిక్స్‌లో క్రికెట్?



లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్ క్రీడలలో క్రికెట్ రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మ్యాచ్‌ల వేదికలు కూడా ప్రకటించారు. 128 సంవత్సరాల తర్వాత క్రికెట్ ఒలింపిక్స్‌లో తిరిగి వస్తోంది. దీని కింద, పురుషులు, మహిళల విభాగాలలో ఆరు జట్లు ఒక్కొక్కటిగా పాల్గొని బంగారు పతకం కోసం పోటీపడనున్నాయి. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నిర్వాహకులు ఏప్రిల్ 15న దక్షిణ కాలిఫోర్నియాలోని పోమోనాలోని ఫెయిర్‌గ్రౌండ్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. క్రికెట్ మ్యాచ్‌ల కోసం ఇక్కడ తాత్కాలిక స్టేడియం నిర్మించారు. ఒలింపిక్స్ తర్వాత ఈ స్టేడియం తొలగిస్తారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు క్రికెట్ వేదిక ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కూడా స్పందించింది. ఈ క్రీడల్లో క్రికెట్ విజయం కోసం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో కలిసి పనిచేస్తానని ఐసీసీ చైర్మన్ జై షా అన్నారు. ‘2028లో లాస్ ఏంజిల్స్‌లో క్రికెట్ వేదిక ప్రకటనను మేం స్వాగతిస్తున్నాం. ఎందుకంటే ఇది ఒలింపిక్స్‌లో మన క్రీడను తిరిగి చేర్చే దిశగా ఒక ముఖ్యమైన అడుగు’ అని షా అన్నారు. క్రికెట్ చాలా ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్స్‌లో టీ20 ఫార్మాట్‌లో ఆడించనున్నారు. సాంప్రదాయ సరిహద్దులను దాటి వెళ్ళడానికి ఇది ఒక గొప్ప అవకాశం అవుతుంది. ఇది కొత్త వీక్షకులను తీసుకువస్తుంది. ఒలింపిక్స్‌కు ఆరు జట్లను ఎలా ఎంపిక చేస్తారనేది ఇంకా నిర్ణయించలేదు. కానీ, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5 జట్లు నేరుగా ప్రవేశించవచ్చని, ఒక జట్టు ఆతిథ్య అమెరికా నుంచి వచ్చే అవకాశం ఉందని అర్థం చేసుకోవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా, క్రికెట్ బహుళ క్రీడా ఈవెంట్లలో కనిపించింది. ఒలింపిక్స్‌కు ముందు, ఆసియా క్రీడలలో, ఇటీవల కామన్వెల్త్ క్రీడలలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగిన సంతగి తెలిసిందే.

## ఉత్కంఠ పోరులో సూపర్ విక్టరీ.. రికార్డు సృష్టించిన పంజాబ్



ఐపిఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ జట్టు మరో అరుదైన రికార్డు సృష్టించింది. కోల్ కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో పంజాబ్ అనూహ్య విజయం సాధించింది. 112 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాను కేవలం 95 పరుగులకే కుప్పకూల్చింది. దీంతో 16 పరుగుల తేడాతో పంజాబ్ ఘన విజయం సాధించింది. అయితే, ఐపిఎల్ లో ఇంత తక్కువ స్కోరు(111) చేసినా గెలుపొందిన తొలి జట్టుగా పంజాబ్ అరుదైన ఘనత సాధించింది. కాగా, గతేడాది కోల్ కతాపై 262 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.4 ఓవర్లలోనే పంజాబ్ ఛేదించింది. దీంతో ఒకే జట్టుపై అత్యధిక స్కోరును ఛేదించి.. అత్యల్ప స్కోరును కాపాడుకున్న జట్టుగా పంజాబ్ నయా రికార్డు నెలకొల్పింది. కాగా, నిన్న జరిగిన మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 15.3 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. తర్వాత స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాను పంజాబ్ బౌలర్లు 15.1 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూల్చి జట్టుకు అద్భుత విజయం సాధించి పెట్టారు. ఓపెనర్లు డికాక్ (2), సునీల్ నరైన్ (5)లు సింగిల్ డిజిట్ స్కోరుకే ఔటయ్యారు. కెప్టెన్ అజింక్య రహానె (17) కూడా నిరాశ పరిచాడు. అంగరిష్ రఘువంశీ (37) ఒక్కడే కాస్త మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచాడు. వెంకటేశ్ అయ్యర్ (7), రింకూ సింగ్ (2) విఫలమయ్యారు. రమణ్‌దీప్ సింగ్ (0), వైభవ్ అరోరా (0), హర్షిత్ రాణా (3) కూడా తేలిపోయారు. రసెల్ (17) కాస్త పోరాడినా ఫలితం లేకుండా పోయింది. పంజాబ్ బౌలర్లలో చాహల్ నాలుగు, జాన్సన్ మూడు వికెట్లు తీశారు.

# తెలుగు ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేక పోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్సే లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందస మేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్ తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. దీంతో ఇప్పుడు మే 1న రిలీజ్ కాబోతున్న సూర్య రెట్రో సినిమాపై బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. పూజా రెట్రో చిత్రంతో పాటు విజయ్‌తో జన నాయగన్ చిత్రంలో నటిస్తుంది. -కాంచన 4 లోనూ నటిస్తుంది. మరోవైపు - కూలీలో స్పెషల్ సాంగ్ చేసింది. అలాగే ఓ హిందీ మూవీలో కూడా నటిస్తుంది. ఇప్పుడు పూజా చేతిలో చాలానే సినిమాలు ఉన్నాయి. అయితే మే 1 రిలీజ్ కాబోతున్న రెట్రో మీద చాలా ఆశలు పెట్టేసుకుంది. ఈ సందర్భంగా టీమ్ లో అందరికంటే ముందుగా తెలుగు ప్రమోషన్లు మొదలుపెట్టింది బుట్టబొమ్మ. ఈ క్రమంలో పూజా హెగ్డేకి టాలీవుడ్‌లో ఎప్పుడు సినిమా చేయబోతున్నారన్న ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానంగా అల వైకుంఠపురములో సినిమాలో చెప్పినట్లుగా నేను గ్యాప్ తీసుకోలేదు.. వచ్చింది. నేను ఏదైనా డిఫరెంట్ గా, కొత్తగా చేయాలని అనుకుంటున్నా. చాలా కథలు విన్నాను కానీ.. ఇప్పటివరకూ నాకు ఏదీ అంతగా కనెక్ట్ కాలేదు. ఈసారి నేను చేసే సినిమా తప్పకుండా బాగుండాలని, వైవిధ్యంగా ఉండాలని అనుకుంటున్నాను అని పేర్కొంది. అయితే త్వరలో పూజా ప్రేమ కథా చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించనుంది. తెలుగు ప్రేక్షకులు తనను ఎంతో ఆదరించారని, హైదరాబాద్ ని సొంత ఇల్లులా ఫీలవుతానని కూడా చెప్పుకొచ్చింది. మూడేళ్ల తర్వాత పూజా తెలుగు ప్రేక్షకులని పలకరించనుందని తెలిసి ఫ్యాన్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు.



# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే

టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది. ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా తెలియాల్సి ఉంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం. 2012లో ధోని చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టిన రాధికా ఆప్టే ఆ తర్వాత కబాలి, బాలకృష్ణ లెజెండ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.






# బ్లాక్ బస్టర్ సినిమాకు రూ.1 రెమ్యునరేషన్ తీసుకున్న మనోజ్ బాజ్‌పాయ్

అగ్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఆల్ టైం క్లాసిక్ చిత్రాలలో సత్య ఒకటి. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి, మనోజ్ బాజ్‌పాయ్ కథానాయకులుగా నటించగా- ఊర్మిళ మతోండ్కర్, షెఫాలీ షా హీరోయిన్‌లుగా నటించారు. ముంబై మాఫియా గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 1998లో జులై 3న విడుదలై సంచలన విజయం అందుకుంది. అప్పటివరకు మూసధోరణి కథలతో నెట్టుకోస్తున్న బాలీవుడ్‌కి అసలైన సినిమాను పరిచయం చేసింది. అంతేకాకుండా ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను సొంతం చేసుకుని సత్తా చాటింది. ఉత్తమ సహాయ నటుడిగా మనోజ్ బాజ్‌పాయ్ జాతీయ అవార్డును గెలుచుకున్నారు. అయితే తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచిన సత్య సినిమాకు మనోజ్‌కేవలం ఆర్జీవీ నుంచి రూ.1 మాత్రమే పారితోషికంగా తీసుకున్నాడంట.. ఈ విషయాన్ని ప్రముఖ దర్శకుడు, నిర్మాత హన్సల్ మెహతా ఒక ఇంటర్వ్యూలో చెప్పుకోచ్చాడు.



# 'స్పిరిట్' సెట్స్‌లోకి ప్రభాస్ అడుగుపెట్టేది అప్పుడే.!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది ఈ చిత్రం అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఏడాది చివరిలో 'స్పిరిట్' సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాతే సందీప్ రెడ్డి స్పిరిట్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. స్పిరిట్ షూటింగ్ మొత్తం 120 రోజులకు పైగా జరగనుందని, అందులో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని సమాచారం. ఈ సినిమా కోసం ప్రభాస్ జిమ్‌లో తీవ్రంగా వర్కవుట్ చేస్తూ కొత్త లుక్‌ను సిద్ధం చేస్తున్నారట. ఇప్పటివరకూ చూడని ప్రత్యేకమైన లుక్‌లో ఆయన ఈ చిత్రంలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు.



# శ్రీలీలతో స్టెప్పులు.. అతని జన్మ ధన్యమైందంటున్న నెటిజన్స్!

టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోన్న హీరోయిన్ శ్రీలీల. ఇటీవల నితిన్ సరసన రాబిన్‌హుడ్ చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. వెంకీ కుడుముల డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే శ్రీలీల ప్రస్తుతం మాస్ మహారాజా రవితేజతో రెండోసారి జతకట్టింది. మాస్ జాతర పేరుతో వస్తోన్న మూవీలో హీరోయిన్‌గా కనిపించనుంది. గతంలో ధమాకా చిత్రంలో రవితేజ సరసన శ్రీలీల నటించిన సంగతి తెలిసిందే. అయితే శ్రీలీల డ్యాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పుష్ప-2 కిస్సిక్ సాంగ్‌తో అభిమానులను ఓ ఊపు ఊపేసింది. హీరోలతో పోటీ పడి మరి తన స్టెప్పులతో అదరగొడుతుంది. శ్రీలీలతో డ్యాన్స్ చేయడమంటే మామూలు ఎనర్జీ సరిపోదు అనేలా స్టెప్పులతో ఆలరిస్తుంది. అలా సరదాగా స్టెప్పులతో అదరగొట్టిన ఈ ముద్దుగుమ్మ డ్యాన్స్ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ?అదేంటో చూసేయండి. అయితే తాను సరదాగా డ్యాన్స్ చేసిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఓ ఈవెంట్‌కు వెళ్లిన ముద్దుగుమ్మ బయటికి వస్తున్న సమయంలో అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డ్‌తో ఓ బాలీవుడ్ పాటకు కాలు కదిపింది. దీనికి సంబంధించిన వీడియోను ఓ నెటిజన్స్ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. శ్రీలీలతో డ్యాన్స్ చేయడం అతని జీవితంలో మరిచిపోలేడని రాసుకొచ్చింది. ఈ క్షణాలు అతని జీవితాంతం గుర్తు పెట్టుకుంటాడని పోస్ట్ చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. ఇక శ్రీలీల సినీ కెరీర్ విషయానికొస్తే.. కన్నడ చిత్రం కిస్ (2019)తో శ్రీలీల మరపురాని అరంగేట్రం చేసింది. పెళ్లి సందడి (2021)లో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల.. భగవంత్ కేసరి (2023), స్కంద (2023), ఆదికేశవ (2023), గుంటూరు కారం (2024) చిత్రాల జయాపజయాలతో సంబంధం లేకుండా వరుసపెట్టి సినిమాలు చేస్తోంది.



Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,